## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల

గుంటూరు,కొత్తరెడ్డిపాలెం అత్యాచార బాలిక కుటుంబాన్ని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు గ్రామంలో పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొన్నూరు మండలంలో ఇలాంటి ఘటన చాలా దురదృష్టకరం. చదువుకునే బాలిక పై ఇలా చేయడం దారుణం. నిందుతుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు. ప్రభుత్వ పరంగా బాలిక కుటుంబానికి సహాయం అందచేశాల చూస్తాం. హోంమంత్రి సమావేశంలో కూడా ఇలాంటి దారుణాల పై సమీక్ష చేశారు. ఇలాంటి కేసుల్లో నిందుతులకు త్వరగా శిక్ష పడేలా ఫాస్ట్ కోర్ట్ లు ఉండాలి. రాష్ట్రంలో ఈ విధమైన కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. తల్లిదండ్రుల ను అప్రమత్తం చేయడానికి పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.


RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386 85220 22029**

**Land Line No : 08517 224194**



కర్నూలు సంపుటి : 04 సంచిక : 76 గురువారం 18-07-2024 పేజీలు :04 వెల:రూ.2.00


## ఢిల్లీలో ముగిసిన చంద్రబాబు పర్యటన

### అమిత్‌షాతో మాత్రమే చర్చలు



న్యూఢిల్లీ,జూలై17 : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకరోజు ఢిల్లీ పర్యటన ముగిసింది. మంగళవారం సాయంత్రం ఆయన ఢిల్లీకి వెళ్లారు. రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఉదయం సీఎం అధికారిక నివాసం(1, జన్‌పథ్)లో పూజలు నిర్వహించారు. అనంతరం విజయవాడకు చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యారు. ఏపీ ఆర్థిక పరిస్థితి గురించి అమిత్ షాకు చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఆర్థిక విధ్వంసానికి గురైందని వెల్లడించారు. అస్తవ్యస్థ నిర్వహణ, అవినీతి కారణంగా ఏపీ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని చంద్రబాబు తెలిపారు. 2019–24 ఆర్థిక సంవత్సరాల మధ్య మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అదుపు తప్పి, అస్థిరమైన అప్పులను వివరిస్తూ విడుదల చేసిన నాలుగు శ్వేతపత్రాలను అమిత్ షాకు వివరించానని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఏపీలో ఎన్డీఏకు అనుకూలంగా తీర్పునిచ్చారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాష్ట్రాన్ని గాడిలో పెడతాయని చంద్రబాబు ట్వీట్ చేశారు. పర్యటనలో సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు కే. రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కేశినేని చిన్ని తదితరులు ఉన్నారు. కాగా.. జన్‌పథ్ నివాసంలో చంద్రబాబును బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ కలిశారు. అనంతరం చంద్రబాబు తన పర్యటన ముగించుకుని విజయవాడకు బయలుదేరారు. అయితే చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను సైతం కలుస్తారంటూ వార్తలు వచ్చాయి. నిర్మలతో భేటీ ఏమీ లేదని అధికారులు వెల్లడించారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటన కేవలం కొన్ని గంటలు మాత్రమే సాగింది.

# తిరుమలపై ప్రత్యేక దృష్టి

### పవిత్రతను కాపాడేలా చర్యలు
### సమర్థులైన అధికారుల నియామకం
### త్వరలోనే పాలకమండలి కోసం కసరత్తు

తిరుమల,జూలై17: తిరుమల పవిత్రతను కాపాడుతూ..భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా టీటీడీ ప్రక్షాళన దిశగాచంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల ఆలయ ప్రతిష్ఠ మంటగలిపారని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధికారులను మార్చివేస్తోంది. ఇప్పటికే ఈవోగా శ్యామలారావును నియమించగా..ఇప్పుడు జేఈవోగా వెంకయ్య చౌదరిని నియమించింది.ఒక టిటిడి ఛైర్మన్‌తో పాటు, పాలకమండలిని నియమించాల్సి ఉంది. పూర్తి ఆధ్యాత్మికతతో పాటు, అభివృద్ధికి సహకరించే వారిక ఇస్థానం కల్పించే అవకాశం ఉంది. తిరుమల తిరుపతి దేవస్థానములను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా సీఎం చంద్రబాబు నడుం బిగించారు. వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలకు కేంద్రంగా టిటీడీని మార్చేశారని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం...ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోంది. అందుకే ఎలాంటి రాజకీయాలతో సంబంధం లేని సీనియర్, సిన్సియర్ అధికారులకు కీలక పదవుల్లో పోస్టింగ్ ఇస్తోంది. తిరుమలకు గత వైభవం తీసుకుని రావడంతోపాటు..కేవలం ఆధ్యాత్మిక వాతావరణం తప్ప ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా తిరుమల కొండలకు పూర్వస్థితిని తీసుకురావాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఈవో ధర్మారెడ్డిని తొలగించింది. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి శ్యామలారావును నియమించింది. ఆయన్ను కేంద్ర సర్వీసుల నుంచి డిప్యూటేషన్‌పై రాష్ట్రానికి రప్పించి కీలకమైన పదవిని కట్టబెట్టింది. గతంలోనూ ఆయన తిరుమల ఈవోగా పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పుడు మరో కీలకమైన జేఈవో పోస్టులో సైతం చిరుమామిళ్ల వెంకయ్య చౌదరిని నియమించారు. ఈయన కూడా కేంద్రం నుంచి డిప్యూటేషన్‌పై తీసుకొచ్చారు. చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి మంచి సమర్థవంతమైన అధికారిగా పేరుంది. ప్రస్తుతం కేంద్ర,ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలోని కస్టమ్స్ కమిషనరేట్ పరిధిలోని విజయవాడశాఖ కమిషనర్‌గా ఆయన పనిచేస్తున్నారు. ఆయన్ను డిప్యూటేషన్ పై ఏపీకి పంపాలన్న రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తిని కేంద్రం అంగీకరించింది. డిప్యూటేషన్‌పై మూడేళ్లపాటు పంపేందుకు అంగీకరించింది. దీంతో ఆయన్న తితిదే జేఈవోగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గతంలో ఆయనకు ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా ఎండీగా పనిచేసిన అనుభం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే తిరుమల ప్రక్షాళన దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈవోగా శ్యామలారావు బాధ్యతలు చేపట్టిన వెంటనే దళారుల ఆగడాల ఆటకట్టించారు. విజిలెన్స్ విభాగాన్ని బలోపేతం చేశారు. ఎక్కడికక్కడ దాడులు చేసి దళారులు పారిపోయేలా చేశారు. భక్తులను దోచుకుంటున్న ఉద్యోగులను హెచ్చరించారు.

## మాజీమంత్రిపెద్దిరెడ్డికి షాక్

### అక్రమిత భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేత



చిత్తూరు,జూలై17 : వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బిగ్ షాక్ తగిలింది. పెద్దిరెడ్డి భూముల దందాలకు చిత్తూరు జిల్లా కలెక్టర్ బ్రేక్ వేశారు. పుంగనూరు నియోజకవర్గం రాగాని పల్లిలో రూ. 100 కోట్లు విలువ చేసే 982 ఎకరాల ప్రభుత్వ అనాదీన భూములను పెద్దిరెడ్డి, ఆయన అనుచరులు కాజేశారు. పెద్దిరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఆయన అనుచరులకు నాటి అధికారులు ఈ భూములను కట్టబెట్టారు. అయితే, కొత్త ప్రభుత్వంలో వీరి అరాచకాలు, అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి.తాజాగా స్థానిక రైతులు కొందరు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ భూములను కబ్జా చేశారని.. పెద్ది రెడ్డి అనుచరుల పేరిట ఆ భూములను రిజిస్ట్రేషన్ చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్.. వెంటనే అన్యాక్రాంతమైన భూములపై ఫోకస్ పెట్టారు. ఈ భూములపై రివిజన్ పిటిషన్ వేయాలని ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.పుంగనూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలు అన్నీఇన్నీ కావని స్థానికులు చెబుతున్నారు. అధికారం దర్పంతో తాను ఏం చేసినా చెల్లుద్దని.. ఇష్టారీతిన వ్యవహరించేవారని ఆరోపిస్తున్నారు. వందలాది ఎకరాల భూములను కబ్జా చేశారని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి దోపిడీపై, కబ్జాలపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఈ నెల 22 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

అమరావతి,ఏపీ అసెంబ్లీ సమావేశాలు జులై 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఈ సమావేశాల్లో ఓటు ఆన్ అకౌంట్ పెట్టాలా? లేకుంటే ఆర్డినెన్స్ పెట్టాలా.. అనే అంశంపై ఈ భేటీలో కీలక చర్చ జరిగింది. మూడు రోజుల పాటు ఈ అంసెబ్లీ సమావేశాలు జరగనున్నాయి గవర్నర్ ప్రసంగంతో ఈ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇక శ్వేత పత్రాల ప్రస్తావనను సైతం అసెంబ్లీలో తీసుకురావాలని కేబినెట్లో చర్చ జరిగింది. మరోవైపు ఈ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు సైతం తీసుకున్నారు.



## పారదర్శక పాలన అందించేందుకే శ్వేతపత్రాలు విడుదల : మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి : వైసీపీ పాలనలో అధికారుల అస్తవ్యస్త పనితీరును చంద్రబాబు గాడిలో పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఏకాదశి సందర్భంగా బుధవారం ఆయన తిరుమల లో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.గత పాలకుల నిర్లక్ష్యం వల్ల జరిగిన నష్టాన్ని ప్రజలకు వివరించి, పారదర్శక పాలన అందించేందుకు 7 శ్వేత పత్రాలను విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు పత్రాలను విడుదల చేశారని వివరించారు. త్వరలో మద్యం, ఆర్థికశాఖపై పత్రాలను విడుదల చేయనున్నారని తెలిపారు. వైఎస్. జగన్ ఐదేండ్ల ఆరాచక పాలన, అన్యాయాలను , దోపిడిని ప్రజలకు వివరించనున్నామని పేర్కొన్నారు.వైసీపీ నాయకులు తమ స్వార్థం కోసం అన్ని శాఖలను ఉపయోగించుకుని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. ల్యాండ్ అండ్ టైటిలింగ్ చట్టంతో దుర్మార్గాలు చేయాలని చూశారని విమర్శించారు. లోపాలను సరిదిద్దుకుని రాబోయే కాలంలో స్వచ్ఛమైన పాలనను చంద్రబాబు నాయకత్వంలో చూడబోతున్నామని వివరించారు. ఇప్పటికే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని,ఇంటింటికే వెళ్లి పెంచిన పెన్షన్లు అందజేశామని తెలిపారు. త్వరలో అసెంబ్లీ సమావేశాలు జరుగున్నాయని వెల్లడించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని , ఏపీ సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని కోరుకున్నానని తెలిపారు.

## వైకాపా నేతలకు శ్వేతపత్రం అంటే తెలుసా

### టిడిపి నేత బుద్ధ వెంకన్న

విజయవాడ,వాతలు పెట్టినా జగన్మోహన్ రెడ్డికి ఇంకా బుద్ధి రాలేదు. పేర్ని నాని కి శ్వేత పత్రం అంటే ఏందో తెలుసా. ఎప్పుడైనా వైసిపి వాళ్లు శ్వేత పత్రాలు విడుదల చేశారా. చంద్రబాబు పోలవరం వెళ్లడం తప్పా. పోలవరం పూర్తి చేయాలని లక్ష్యంతో చంద్రబాబు పర్యటన చేస్తున్నారు. మీ పరిపాలన ఎలా చేశారో చెప్పాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉంది. వైసిపి వాళ్ళ దొంగతనాలు ఎక్కడ బయటపడతాయో అని భయపడి ప్రెస్ మీట్ లు పెడుతున్నారు. చంద్రబాబు సీఎం అవ్వగానే పెంచిన పింఛన్ ను అందించారు. జగన్ ముఖ్యమంత్రి అవ్వగానే ప్రజావేదిక కూల్చారు. అసలు చెత్త పన్ను వేసింది ఎవరు. మీరు ఐదు సంవత్సరాలు పాటు రాష్ట్రాన్ని చెత్తగా మార్చేశారు. ఆ చెత్తంతా క్లీన్ చేస్తున్నారు చంద్రబాబు. 35 రోజుల్లోనే ఆ చెత్త అంత క్లీన్ అయిపోతుందా. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు ఢిల్లీ టూర్లు చేస్తున్నాడు. ఎప్పుడైనా జగన్ ఢిల్లీ వెళ్ళినప్పుడ రాష్ట్ర అభివృద్ధికి పని చేశాడా. దోచుకున్న లక్షల కోట్లతో సోషల్ మీడియాని నడిపిస్తున్నారు. దోచుకున్న డబ్బులతో సోషల్ మీడియా తో కూటమినేతలపై విమర్శలు చేస్తున్నారు. మీకు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేదు. ఇప్పటికి ప్రజలు వైసిపి పార్టీని అసహ్యించుకుంటున్నారు.. ఆ 11 సీట్లు ఎందుకు ఇచ్చామని ప్రజలు ఆలోచిస్తున్నారు. పూర్తిగా భూస్థాపితం చేస్తే బాగుండు అనుకుంటున్నారు. పేర్ని నాని బందర ను ఏం అభివృద్ధి చేశారు. ఇప్పటివరకు పోర్టు అనేది పూర్తి చేయలేదు. చంద్రబాబు నాయుడు పోర్ట్ నిర్మాణం పూర్తి చేస్తారు. మచిలీపట్నానికి 70,000 కోట్లతో బిపిసిఎల్ రిఫైనరీ తీసుకొస్తున్నామని అన్నారు.జగన్మోహన్రెడ్డి అధికారంలోకి రావడం అనేది ఇంకా కలే. చంద్రబాబుకు మరో అవకాశం వచ్చినట్లు,తమకి కూడా అధికారం వస్తుంది అని వైసిపి నేతలు పగటి కలలు కంటున్నారు. చంద్రబాబు రెక్కల కష్టంతో పార్టీని అధికారులకు తీసుకొచ్చారు. చంద్రబాబు నాయుడు ప్రజలు నమ్మారు కాబట్టి అధికారంలోకి వచ్చాము. జగన్మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి నమ్మే అవకాశం లేదు. వైసిపి నేతలు కాజేసిన డబ్బు గురించి ప్రజలకు చెప్పడం తప్ప. జగన్ భవంతుళ్ళు ఉండొచ్చు కానీ, పేదవాళ్లు సొంత నివాసాల్లో ఉండకూడదా . టిడ్కో ఇల్లు ఎందుకు జగన్ పూర్తి చేయలేకపోయాడు. గాలి మాటలు చెప్పడం వైసీపీ నేతలు మానుకోవాలి. 2024 నుంచీ 2029 కాలంలో రాష్ట్రం పరుగులు పెడుతుంది. అసలు రాష్ట్రంలో ఎన్ని శాఖలు ఉన్నాయో జగన్మోహన్ రెడ్డికి తెలుసా. ఇప్పటికే ప్రజలు ఓటు రూపంతో వైసీపీ నేతలకు వాతలు పెట్టారు. నిజంగా కొలిమిలో కడ్డీ పెట్టి వాత పెట్టేదాకా తెచ్చుకోవద్దని అన్నారు.



## తిరుపతి చేరుకున్న నితిన్ గడ్కరీ

### రాష్ట్ర రోడ్డలపై అధికారులతో సమీక్ష



తిరుపతి,జూలై17 : రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఘన స్వాగతం లభించింది. ఏపీ రోడ్డు రవాణా శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే తదితరులు ఆయనకు పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో ఆంధ్రప్రదేశ్ జాతీయ రహదారులు, హైవే ప్రాజెక్టులు, రాష్ట్ర రహదారుల పరిస్థితిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతిని ఏపీలోని ఇతర ప్రాంతాలు, పక్క రాష్ట్రాలతో అనుసంధానించే పలు రహదారుల ప్రాజెక్టులకు ప్రాథమికంగా ఆమోదం తెలిపింది. 189 కి.మీ. పొడవైన అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు సహా కీలక ప్రాజెక్టులపై రాష్ట్ర మంత్రి జనార్దన్ రెడ్డి, అధికారులతో కేంద్ర మంత్రి మాట్లాడినట్లు సమాచారం. అలాగే విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నిడమనూరు వరకు ఫ్లై ఓవర్ ఏర్పాటు సహా రాష్ట్రంలోని రోడ్లు, రహదారుల పరిస్థితిపై కేంద్ర మంత్రి అధికారులతో చర్చించినట్లు తెలుస్తోంది. సమీక్ష అనంతరం మదనపల్లెలో సత్సంగ్ ఫౌండేషన్‌కు నితిన్ గడ్కరీ హెలికాప్టర్‌లో బయలుదేరారు. రాత్రి తిరుమల చేరుకుని, గురువారం ఉదయం ప్రాతఃకాల సమయంలో స్వామివారిని ఆయన దర్శించుకోనున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన తిరుగు ప్రయాణం చేయనున్నారు.

## సింహాచల గిరిప్రదక్షిణను విజయవంతం చేయాలి

విశాఖపట్నం,విశాఖ సింహాచలం లక్ష్మీ నరసింహ స్వామి గిరిప్రదక్షిణను అందరం కలిసి పని చేసి విజయవంతం చేద్దామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 20, 21వ తేదీల్లో జరగబోయే గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు గంటా శ్రీనివాసరావు సూచనలు చేశారు. సింహగిరి చుట్టూ ఉన్న 32 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడికక్కడ స్టాళ్లు ఏర్పాటుచేయాలి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టే చర్యల గురించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ ప్రధానమైన వేడుక అని, దీనికోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా ఏర్పాట్లుచేయాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ సూచించారు. విఐపిలు, వివిఐపిల దర్శనాల ప్రభావం సాధారణ భక్తులపై పడకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ గిరిప్రదక్షిణకు అధికార యంత్రాంగం తరపున పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. సింహగిరి చుట్టూ 28 చోట్ల ప్రత్యేక స్టాళ్లను, 11 మెడికల్ క్యాంపులుగిరిప్రదక్షిణ సాగే రహదారి పొడవునా 100 సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రస్థానం



# సంపాదకీయం

గురువారం 18-07-2024

## ప్రపంచాన్ని కుదిపేస్తున్న 'మేక్ ఇన్ ఇండియా'..

ప్రధాని మోడీ మొదటి దఫాలో వచ్చిన 'మేక్ ఇన్ ఇండియా' కాన్సెప్ట్ చాలా తక్కువ సమయంలోనే మంచి ఫలితాలను సాధించింది. చైనా ప్రొడక్ట్ లను ద్వేషించే ప్రపంచం భారత్ ప్రొడక్ట్స్ వైపు మొగ్గు చూపుతోంది. భారత్ కూడా ప్రపంచ మన్ననలను అందుకునేందుకు నాణ్యమైన వస్తువులను తయారు చేసి ఎగుమతి చేస్తుందివిదేశాల్లో భారతీయ వస్తువు (మేడ్ ఇన్ ఇండియా)లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ విషయాన్ని ఎగుమతి లెక్కలు ధ్రువీకరిస్తున్నాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాత్కాలిక వాణిజ్య డేటా ప్రకారం.. భారతదేశం మొత్తం ఎగుమతులు (వస్తువులు, సేవలతో సహా) ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల కాలంలో వి200.3 బిలియన్లుగా ఉన్నాయి. గతేడాదిఏప్రిల్ నుంచి జూన్ మూడు నెలల కాలంలో వి184.5 బిలియన్లుగా ఉన్నాయి. విశేషం ఏంటంటే.. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో దేశం చేసిన అత్యధిక ఎగుమతి ఇదే.ఏ దేశం ఎగుమతి డేటా ఎలా పెరిగిందో ఎలా లెక్కిస్తారంటే.. ఆ దేశంలో తయారైన వస్తువులకు ఇతర దేశాల్లో మార్కెట్ లో డిమాండ్ ఎంత పెరిగిందన్న దాన్ని బట్టి లెక్కిస్తారు. భారతదేశం ఎగుమతులకు కూడా విదేశాలలో విపరీతమైన క్రేజ్ ఉంది. అందుకే భారత ఎగుమతుల్లో బలమైన పెరుగుదల కనిపిస్తోంది. ప్రభుత్వం విడుదల చేసిన డేటాను పరిశీలిస్తే, జూన్ 2024లో వస్తువుల ఎగుమతి 2.55 శాతం పెరిగి 35.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది ఏడాది క్రితం జూన్‌లో 34.32 బిలియన్ డాలర్లుగా ఉంది. గత నెల, మే, 2024లో, భారతదేశ వస్తువుల ఎగుమతి 9.1 శాతం పెరిగి వి38.13 బిలియన్లకు చేరుకుంది.ఎగుమతులే కాదు.. దిగుమతులను కూడా దేశం పెంచుకుంది. జూన్ లో దేశ దిగుమతి 5 శాతం పెరిగింది. జూన్, 2024లో వస్తువుల దిగుమతి 5 శాతం పెరిగి 56.18 బిలియన్ డాలర్లకు చేరుకోగా, జూన్, 2023లో అది 53.51 బిలియన్ డాలర్లుగా ఉంది. వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకారం.. జూన్‌లో భారత వాణిజ్య లోటు 20.98 బిలియన్ డాలర్లుగా నమోదైంది.ఒకవైపు దేశంలో ద్రవ్యోల్బణం గణాంకాలు పెరిగాయి. మొదటిది, రిటైల్ ద్రవ్యోల్బణం 5 శాతానికి పైగా ఉంది. టోకు ద్రవ్యోల్బణం డేటాలో, డబ్ల్యూపీఐ (చిఖఎ) కూడా 3.36 శాతానికి చేరుకుంది. అయితే, ఎగుమతి డేటా శుభవార్తను మోసుకచ్చింది.దేశ ఎగుమతుల డేటాను పరిశీలిస్తే.. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశం ఎగుమతుల్లో 800 బిలియన్ డాలర్లకు పైగా వృద్ధిని సాధించిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. ఎగుమతి డేటాను విడుదల చేస్తూ, త్రైమాసిక గణాంకాలు ఆశాజనకంగా ఉన్నాయని.. మొత్తం ఎగుమతులు 200 బిలియన్ డాలర్లు దాటిందని, ఇదే వేగం కొనసాగితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 800 బిలియన్ డాలర్లు దాటుతాయని వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వాల్ తెలిపారు.ప్రధాని మోడీ మొదటి దఫాలో వచ్చిన 'మేక్ ఇన్ ఇండియా' కాన్సెప్ట్ చాలా తక్కువ సమయంలోనే మంచి ఫలితాలను సాధించింది. చైనా ప్రొడక్ట్ లను ద్వేషించే ప్రపంచం భారత్ ప్రొడక్ట్స్ వైపు మొగ్గు చూపుతోంది. భారత్ కూడా ప్రపంచ మన్ననలను అందుకునేందుకు నాణ్యమైన వస్తువులను తయారు చేసి ఎగుమతి చేస్తుంది. భారత్ ప్రాచీణమైన సంప్రదాయంలో భాగంగా ఇక్కడి వస్తువులకు కూడా అంతే క్రేజ్ ఉంటుంది. కాబట్టి ప్రపంచం వీటిని ఎక్కువగా ఆదరిస్తుంది.ఈ ఎగుమతులు ఇలానే పెరుగుకుంటూ వెళ్తే.. దేశం మరింత ఆర్థికంగా బలపడుతుందని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. మోడీ చెప్పిన విధంగా తక్కువ సమయంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని చెప్తున్నారు.

# వైట్ పేపర్ ఎఫెక్ట్..ఢిల్లీకి ఏపీ నేతలు

విజయవాడ, జూలై 17 వైసీపీ సర్కార్ అవినీతిని చంద్రబాబు ఎండగడుతున్నారు.గత ప్రభుత్వం హయాంలో జరిగిన దోపిడీని, అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నారు. వరుసగా శ్వేత పత్రాలను విడుదల చేస్తూ..వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. ఇప్పటివరకు నాలుగు శ్వేత పత్రాలను విడుదల చేశారు. చివరిగా నిన్న భూదోపిడి పై విడుదల చేసిన శ్వేత పత్రంతో వైసీపీ నేతలు బెంబేలెత్తి పోతున్నారు. తమకు ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. వాటి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.వైసిపి హయాంలో చాలామంది కీలక నేతలపై భారీ అవినీతి ఆరోపణలు వచ్చాయి. సొంత పార్టీ శ్రేణులే వారిపై విమర్శలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. వరుసగా శ్వేత పత్రాలు విడుదల చేయడంతో.. తమపై ప్రాథమిక దర్యాప్తు చేశారని వైసీపీ నేతలు ఒక అంచనాకు వస్తున్నారు. అందుకే తమ అరెస్టులు ఉంటాయని అనుమానిస్తున్నారు. కేసులతో వెంటాడుతారని కూడా భావిస్తున్నారు. దాని నుంచి తప్పించుకోవాలంటే పార్టీ మారడం శ్రేయస్కరమని అనుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరాలని ఎక్కువ మంది ప్రయత్నిస్తున్నారు. కానీ ఇప్పటికే అటువంటి నేతలు విషయంలో చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దూకుడుగా వ్యవహరించి, అవినీతికి పాల్పడిన నేతలను పార్టీలో చేర్చుకునే ప్రసక్తి లేదని తేల్చి చెప్తారు. అన్ని జిల్లాల నాయకులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.జనసేన కూడా ఈ విషయంలో ఫుల్ క్లారిటీతో ఉంది. క్షేత్రస్థాయిలో బలం పెంచుకోవాలని చూస్తోంది. అయితే అది చేరికల ద్వారా కాకుండా.. సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై పోరాటం వంటి వాటితో సాధించాలని చూస్తోంది. ఎన్నికలకు ముందు కొంతమంది జనసేన నుంచి బయటకు వెళ్లిపోయారు. ఆ సమయంలో రకరకాల ఆరోపణలు చేశారు. పార్టీపై బురదజల్లారు. అయినా సరే ప్రజలు జనసేన ను ఆదరించారు. అత్యధిక మెజారిటీతో గెలిపించారు. పోటీ చేసిన 21 స్థానాల్లో సంపూర్ణ విజయం కట్టబెట్టారు. అందుకే ప్రజలతో మమేకమై పని చేయాలని జనసేన అధినేత పవన్ నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ నుంచి చేరికలను ప్రోత్సహించవద్దని పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.వైసీపీ నుంచి ఇతర పార్టీలో చేరేందుకు సిద్ధమైన నేతలకు బిజెపి కనిపిస్తోంది. అందుకే వైసీపీ నేతలు ఢిల్లీలో వాలిపోతున్నారు. తెలిసిన నేతలను పట్టుకొని వారి సహాయంతో పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. అయితే ఈ విషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోకపోతే.. ఆయన విడుదల చేస్తున్న శ్వేత పత్రాలకు విలువ ఉండదు. ఆ శ్వేత పత్రాలతో వైసిపి నేతల అవినీతిని బయట పెడుతున్నారు. ఇప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలే నేరుగా ఢిల్లీకి క్యూ కడుతున్నారు. బిజెపిలో చేరేందుకు సిద్ధపడి పోతున్నారు. అయితే భాగస్వామ్య పార్టీగా తెలుగుదేశం అభిప్రాయం కొనుక్కోవాల్సిన అవసరం ఢిల్లీ పెద్దలపై ఉంది. ఈరోజు ఢిల్లీ వెళ్లనున్న చంద్రబాబు అమిత్ షా తో ఇదే విషయం ప్రస్తావిస్తారని టిడిపి శ్రేణులు భావిస్తున్నాయి. అవినీతిఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేతల విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని,తమను సంప్రదించిన తర్వాతే పార్టీలో చేర్చుకోవాలని చంద్రబాబు ఢిల్లీ పెద్దలకు సూచించే అవకాశం ఉంది.అయితే వైసిపి నేతలను బిజెపిలో చేర్పించేందుకు.. కొంతమంది బిజెపి రాష్ట్ర నేతలు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. టిడిపి తో పొత్తు ఇష్టం లేని చాలామంది నేతలు ఈ ఎన్నికల్లో సైలెంట్ అయ్యారు. వారికి పెద్దగా ప్రాధాన్యం కూడా దక్కలేదు. కానీ టిడిపి అనుకూలురు అని ముద్రపడిన నేతలకు మాత్రమే ఈసారి ఎన్నికల్లో పోటీ చేసే ఛాన్స్ వచ్చింది. అయితే టిక్కెట్లు ఆశించిన బిజెపి సీనియర్లు చాలామంది ఇప్పుడు పావులు కదపడం ప్రారంభించారు. వైసీపీ నేతలను బిజెపిలోకి తెప్పించి.. ఏపీలో వైసీపీ అండతో అసమ్మతి రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. వారి ప్రయత్నాలు ఏ మేరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

# జేసీ పవన్ కు కీలక పదవి



అనంతపురం, జూలై 17 అనంతపురం జిల్లా మొత్తంలో చక్రం తిప్పిన నాయకుడు మాజీ మంత్రి, మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి.. జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం నుంచి 1985 నుంచి దివాకర్ రెడ్డి వరుసగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ కుటుంబంతో విభేదాల కారణంగా 2004లో గెలిచినా ఆ సీనియర్‌కు కేబినెట్ బెర్త్ దక్కలేదు. 2009లో వైఎస్ మరణాంతరం ఆయనకు కిరణ్ కేబినెట్ బెర్త్ దక్కింది. దివాకరరెడ్డి తమ్ముడు జేసీ ప్రభాకరరెడ్డి సైతం 1987 నుంచి తాడిపత్రి చైర్మన్‌గా మూడు సార్లు గెలిచి సత్తా చాటుకున్నారు.రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరిన జేసీ సోదరులకు చంద్రబాబునాయుడు సముచిత ప్రాధాన్యత ఇచ్చారు. 2014 ఎన్నికల్లో దివాకరరెడ్డి అనంతపురం ఎంపీగా గెలిస్తే.. ప్రభాకరరెడ్డి తాడిపత్రి నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019లో ఎన్నికల్లో జేసీ దివాకర్ రెడ్డి తనయుడు జెసి పవన్ రెడ్డి అనంతపురం ఎంపీగా, జేసీ ప్రభాకర్ రెడ్డి తనయుడు అస్మిత్ రెడ్డి తాడిపత్రి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఇద్దరు ఓటమి పాలయ్యారు. అయితే జేసీ ప్రభాకరరెడ్డి 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి వైసీపీ హవాలోనూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికవ్వడం విశేషం.జేసీ బ్రదర్స్ ఏ పార్టీలో ఉన్నా వార స్టైల్ డిఫరెంట్‌గా వుంటుంది. సహజంగా రాజకీయ నాయకులు ఏది మాట్లాడినా చాలా జాగ్రత్తగా మాట్లాడుతారు. తమ అభిప్రాయలు డైరెక్ట్ గా ఎక్స్‌ప్రెస్ చేయరు. కాని జేసీ బ్రదర్స్ మాత్రం తన అభిప్రాయలు నిర్మొహమాటంగా చెప్పేస్తారు. దేనికి భయపడరు. కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడేస్తారు. మనస్సుకు అనిపించింది మీడియా ముందే చెప్పేస్తారు. దాంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక సమస్యలు, కేసులు ఎదుర్కొన్నారు. వారి ట్రావెల్స్ బస్సులు సీజ్ చేసి వైసీపీ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందుకు గురి చేసింది. అయినా వారు తమ స్టైల్ మార్చుకోలేదు.ఆ క్రమంలో మొన్నటి ఎన్నికల్లో ఉమ్మడి అనంత జిల్లాల్లో టీడీపీ క్లీన్‌స్వీప్ చేసింది. జేసీ అస్మిత్ రెడ్డి తాడిపత్రిలో మంచి మెజార్టీతో గెలుపొందారు. దాదాపు 27 వేల పైచిలుకు ఓట్ల తేడాతో కేతిరెడ్డి పెద్దారెడ్డిపై విజయం సాధించారు. అప్పట్లో అనంతపురం ఎంపీ స్థానం నుంచి జెసి పవన్ కుమార్ రెడ్డి పోటీ చేస్తాడని భారీ ఎత్తున టాక్ నడిచింది. దానికి తగ్గట్టుగానే పవన్ రెడ్డి కూడా మరోసారి పోటి చేసేందుకు ఆసక్తి గా ఉండడంతో ఆ యువనేతకే టికెట్ ద్కతుందని జోరుగా ప్రచారం నడిచింది.కానీ చివరి నిమిషంలో సామాజిక సమీకరణలు దివాకరరెడ్డి వారసుడికి కలిసి రాలేదు. పవన్ టికెట్ త్యాగం చేసి అనంతపురం పార్లమెంట్ స్థానంలో టీడీపీ గెలుపొందడానికి కృషి చేశారు. దాంతో అనంతపురం ఎంపీగా టీడీపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ గెలుపొందారు. ఈ మెజార్టీ వెనుక జేసీ ఫ్యామిలీ పాత్ర ఉందనేది సుస్పష్టం. జిల్లాల్లో అంతటి ప్రాముఖ్యం ఉన్న కుటుంభం కావడంతో టీడిపి అధిష్టానం కూడ వారికి ఏంతో ప్రాముఖ్యాన్ని ఇస్తూ వచ్చింది. ఇక టీడిపి అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటింది. నామినేటెడ్ పోస్టుల భర్తీకి కూడా సమయం ఆసన్నమైంది.జేసీ కుటుంబానికి నామినేటెడ్ పదవులపై ఆసక్తి లేనప్పటికీ టిడిపి అధిష్టానమే వారి కుటుంబానికి ఏదో ఒక పదవి ఇవ్వాలని భావిస్తుందట. దానికి తోడు గతంలో జేసీ పవన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఇక ఈ సారి కూడా అదే ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడి పదవీ ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దానికి తోడు పవన్ రెడ్డి ఇటీవల నారా లోకేష్‌ని కలవడంతో ఆ ప్రచారం మరింత ఊపందుకుంది.తాజాగా మంగళగిరిలోని నారా లోకేష్ క్యాంప్ ఆఫీస్‌లో లోకేష్‌ని పవన్ రెడ్డి కలవడంతో ఇప్పుడు మరోసారి ఆ చర్చ తెరపైకి వచ్చింది. కచ్చితంగా జేసీ పవన్ రెడ్డికి ఏదో ఒక పదవి ఇస్తారని ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఛాన్స్ దక్కే అవకాశం ఉందంటూ జోరుగా ప్రచారం నడుస్తోంది. జేసీ పవన్ రెడ్డికి దేశంలో అనేకమంది క్రీడాకారులతో మంచి పరిచయాలు ఉండటంతో ఈ పదవిపై మరోసారి చర్చ మొదలైంది. జేసీ పవన్ రెడ్డికి క్రికెటర్లు ఎంఎస్ ధోని, సచిన్ టెండుల్కర్, బాలివుడ్ స్టార్ సల్మాన్‌ఖాన్ వంటి వీవీఐపీలతో స్నేహం ఉంది. ధోని హైదరాబాద్ ఎప్పుడు వచ్చినా కూడా జెసి పవన్ రెడ్డి ఇంట్లో బస చేస్తారు. అలాంటి పవన్ సేవలను వాడుకోవడానికి టీడీపీ ఖచ్చితంగా ఆయనకు సముచిత స్థానం కల్పిస్తుందన్న టాక్ వినిపిస్తుంది.

## విజయసాయిరెడ్డికి ఇంటి పోరేనా

నెల్లూరు, జూలై 17 (న్యూస్ పల్స్)పార్టీలో సాధారణ ఎంపీ, ఎమ్మెల్యే స్థాయి వ్యక్తులు ఆయన్ని టార్గెట్ చేయలేరు. ఒకవేళ అలాంటి వారు చేసినా.. వారి వెనక ఎవరిదో పెద్ద హస్తమే ఉంటుంది. అయితే.. ఇప్పుడే కాదు.. గతంలో కూడా ఓసారి విజయసాయి రెడ్డిని జగన్ పక్కన పెట్టారనే వార్తలు వచ్చాయి. వార్తలు మాత్రమే కాదు.. అప్పట్లో పార్టీలో విజయసాయిరెడ్డి ప్రియారిటీ చూస్తే అదే అనిపిస్తోంది. పార్టీ ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి ఆయన్ని తప్పించారు. ఆ బాధ్యతలను వైవీ సుబ్బారెడ్డికి ఇచ్చారు. ఇదంతా సజ్జల చేయించారనే అనుమానాలు కూడా అప్పట్లో వచ్చాయి. అంతేకాదు.. పార్టీలో ప్రియారిటీ తగ్గిందని గ్రహించి విజయసాయిరెడ్డి కూడా తన వైఖరి మార్చుకున్నారని చాలా మంది చెప్పారు.చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకుండా ట్విట్టర్‌లో టీడీపీపై, చంద్రబాబుపై విరుచుకుపడిన విజయసాయి రెడ్డి ఆ మధ్య సైలెంట్ అయ్యారు. తన విమర్శల పదును తగ్గించారు. గత ప్రభుత్వాన్ని ప్రశంసించడం తప్పా.. పెద్ద ప్రతిపక్షాలపై విమర్శల జోలికి వెళ్లలేదు. తన పరిధిలో ఉన్న పని తాను చేసుకుంటూ పోయేవారు. అయితే.. ఎన్నికలు దగ్గరపడేసరికి మరోసారి జగన్.. విజయసాయిరెడ్డికి ప్రాధాన్యత ఇచ్చినట్టు కనిపించారు. కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల బాధ్యతలు ఆయనకే ఇచ్చారు. దీంతో మళ్లీ యాక్టివ్ అయ్యారు విజయసాయిరెడ్డి. అయితే.. అప్పుడు కూడా విజయసాయిరెడ్డిపై సజ్జల రామకృష్ణారెడి కుట్రలు చేశారని అనుమానాలు ఉన్నాయి.నెల్లూరు జిల్లాలో వైసీపీ నేతలంతా ఖాళీ అయిపోయారు. అసలు పోటీ చేయడానికి కూడా ఎవరూ లేరు. అలాంటి టైంలో నెల్లూరు ఎంపీగా జగన్ విజయసాయిరెడ్డి పేరు ప్రతిపాదించారు. గెలిచే అవకాశం లేనపుడు ఆయన పేరు తెరపైకి తీసుకొని రావడం నిజంగా ఆయనను రాజకీయంగా తొక్కేడమేనని చాలా మంది అన్నారు. ఈ ప్రతిపాదన వెనుక సజ్జల ఉన్నారన అప్పుడు టాక్ నడించింది. ఎట్టకేలకు విజయసాయిరెడ్డే స్వయంగా తనపై వైసీపీ నేతలు కూడా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. దీంతో.. ఇప్పుడు మరోసారి సజ్జల వైపే అందరి చూపు పడింది.విజయసాయిరెడ్డి మరో విషయం కూడా చెప్పారు. తన సొంతంగా ఓ ఛానెల్ పెడుతున్నానని ఆయన అన్నారు. రెండేళ్ల క్రితమే పెట్టాలనుకున్నానని.. జగన్ వద్దని చెప్పడంతో ఆగిపోయానని చెప్పారు. ఇక్కడే మరో అనుమానానికి కూడా తావిస్తుంది. తమకు అనుకూలంగా ఓ ఛానెల్ వస్తుందంటే జగన్ ఎందుకు వద్దనుకున్నారు? అనేది ప్రశ్న. విజయసాయిరెడ్డిని ఎందుకు అడ్డుకున్నారు అనే అనుమానాలు వస్తున్నాయి. రెండేళ్ల క్రితంవైసీపీలోవిజయసాయిరెడ్డి ప్రియారిటి తగ్గిందనే ప్రచారం జరుగుతున్నప్పటి మాట. ప్రియారిటీ తగ్గింది కాబట్టే విజయసాయిరెడ్డి సొంతగా ఛానెల్ పెట్టి తనేంటో చూపించాలి అనుకున్నారు. అదే సమయంలో విజయ సాయిరెడ్డి ఛానెల్ పెడితే.. తనకు ఇబ్బంది అవుతుందని జగన్ భావించి ఉంటారు.

# బాలినేని వర్సెస్ చెవిరెడ్డి

ఒంగోలు, జూలై 17 మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రకాశం జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పిన నేత.. ఒంగోలు ఎమ్మెల్యేగా 5 సార్లు గెలిచిన ఆ కీలక నేత మొన్నటి ఎన్నికలే తనకు చివరి ఎన్నికలని ప్రకటించారు. అయితే ఇప్పుడు అటు వైసీపీ అధ్యక్షుడు తీసుకుంటున్న నిర్ణయాలు, ఇటు ఒంగోలులో తనపై వస్తున్న ఆరోపణలతో తాను రాజకీయాల్లోనే ఉంటానని ప్రకటించారు. జిల్లా వైసీపీ అధ్యక్ష పదవి చెవిరెడ్డికి కట్టబెడతారన్న ప్రచారంపై ఆయన తనదైన స్టైల్లో రియాక్ట్ అయ్యారు. జగన్‌కి సమీపబంధువు అయిన బాలినేని రాజకీయాల్లో ఉంటానంటూనే.. అవసరమైతే వైసీపీని వీడతానని ప్రకటించి ఆ పార్టీలో కలకలం రేపారు.ప్రజలు, కార్యకర్తల కోసం రాజకీయాల్లో కొనసాగుతానని ప్రకటించారు. ఒంగోలు మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వాస్తవానికి మొన్నటి ఎన్నికలే తనకు చివరివని ప్రకటించారాయన. ఒంగోలు ఎమ్మెల్యేగా 5 సార్లు విజయం సాధించి జగన్ కేబినెట్లో పనిచేసిన బాలినేని ఈ సారి భారీ ఓటమి చవి చూశారు. దాంతో ఆయన రాజకీయ ప్రస్థానం ముగిసినట్లే అని అందరూ భావించారు. దానికి తగ్గట్లే ఓటమి పాలైన దగ్గర నుంచి ఆయన హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. ఆ క్రమంలో ఆయనపై ఒంగోలులోని ప్రత్యర్థులు అవినీతి ఆరోపణలు గుప్పించి.. పార్టీ మారబోతున్నారని ప్రచారం నిర్వహించారు. వాటన్నిటిని ఖండిస్తూ ఆయన తన నిర్ణయం ప్రకటించారు.తన కెరీర్‌లో 2014 ఎన్నికల్లో తొలిసారి ఓడిపోయిన బాలినేని నాలుగున్నరేళ్ల పాటు క్యాడెర్‌కు అందుబాటులో లేరు. అప్పటితో పోలిస్తే ఈ ఎన్నికల్లో మరింత ఘోరంగా ఓడిపోయారు. దాంతో ఇప్పుడు కూడా పార్టీ కార్యకలాపాలను పెద్దగా పట్టించుకోరన్న అభిప్రాయం వ్యక్తమైంది. దానికి తగ్గట్లే జగన్ సమీక్షలకు కూడా ఆయన హాజరు కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా పార్టీ బాధ్యతలను ఎంపీగా ఓటమిపాలైన చెవిరెడ్డి భాస్కరరెడ్డికి కట్టబెడతారన్న ప్రచారం మొదలైంది. దాంతో జిల్లా వైసీపీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళం కనిపిస్తుంది.జగన్ నిర్ణయాలు ప్రకాశం జిల్లా నేతల మధ్య సమన్వయ లోపాన్ని పెంచుతున్నాయి. ఎన్నికలకు ముందు నుంచే వైసీపీలో ఉన్న నాయకత్వ సంక్షోభం ఎన్నికల తర్వాత కూడా కొనసాగుతోంది. జిల్లా నేతలను కించపరిచేలా అధినేత జగన్ నిర్ణయాలు తీసుకుంటున్నారనే అసంతృప్తి నేతల మధ్య ఉంది. తాజాగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా పెట్టాలనే నిర్ణయాన్ని జిల్లాలోని ముఖ్య నేతలకు తెలియజేశారంట. దాంతో జిల్లాలో ఇంత మంది సీనియర్ నాయకులుంటే ఎక్కడో చిత్తూరు జిల్లా



నుంచి తెచ్చి ఇక్కడ అధ్యక్షుడిని పెట్టడం ఏమిటనే చర్చ మొదలైంది.ఆ క్రమంలో జిల్లాకు వచ్చిన బాలినేని భగ్గుమంటున్నారు. ఎన్నిక ల్లోనే చెవిరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా పెట్టడాన్ని తీవ్రంగా తప్పుపట్టిన బాలినేని ఇప్పుడు ఏకంగా పార్టీ అధ్యక్షుడిగా పెట్టడం ఏంటని మండిపడుతున్నారు. చెవిరెడ్డి వల్లే ఎన్నికల్లో నష్టపోయామనే భావనలో ఉన్న బాలినేని జగన్ నిర్ణయాల పట్ల అసంతృప్తిగానే కనిపిస్తున్నారు. జిల్లా నేతలతో చర్చిం చి ఏదైనా నిర్ణయాలు తీసుకోకుండా ఏకపక్షం గా ఎక్కడో పొరుగు జిల్లాల నేతలను ప్రకాశం జిల్లాకు తెచ్చి జిల్లా అధ్యక్షుడిగా పెడితే తాము ఏముఖం పెట్టుకుని తిరగాలనే భావనలో జిల్లా వైసీపీ ముఖ్యనేతలున్నారు. దీనిపై పార్టీలో ఇప్పటికే తీవ్ర చర్చ మొదలైంది. ఇదే జరిగితే తాను పార్టీకి రాజీనామా చేస్తానని బాలినేని తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు సమాచారంఎంపీ అభ్యర్థిగానే చెవిరెడ్డిని బాలినేని తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. ఒంగోలులో వైసీపీ కార్యాలయం వద్ద చెవిరెడ్డి ఫ్లెక్సీలను బాలినేని అభిమానులు తగలబెట్టారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో జగన్ నిర్ణయాన్ని బాలినేని గౌరవించి చెవిరెడ్డికి మద్దతివ్వాల్సి వచ్చిది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థులకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా చెవిరెడ్డి బాగా ఇబ్బంది పెట్టారంట. ఇటీవల ఒంగోలులో కోట్ల ఖరిదైన ఆర్టీసీ స్థలాని టెండర్స్ పేరుతో.. బాలినేనికి తెలియకుండా దక్కించుకొవటం. మరింత కోపం తెప్పించిందట.టీడీపీ అధికారంలోకి వచ్చి చెవిరెడ్డి వ్యవహారం బయటపెట్టడంతో బాలినేని షాక్ అయ్యారట. అలాంటి చెవిరెడ్డికి ప్రకాశం జిల్లా వైసీపీ పగ్గాలు అప్పగిస్తే.. రేపు జిల్లాలో ముఖం ఎలా చూపించాలని సన్నిహితులతో అంటున్నారంట. ఎక్కడో చిత్తూరు జిల్లా కు చెందిన చెవిరెడ్డి ప్రకాశం జిల్లాలో పెత్తనం ఏంటని చెవిరెడ్డికి జగన్ ప్రకాశం జిల్లా బాధ్యతాలు అప్పగిస్తే బాలినేని నిర్మోహమాటంగా వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరతారని ఆయన అనుచరులు ఆఫ్ ద రికార్డ్‌గా చెప్పుకొస్తున్నారు. తాజాగా మీడియా ముందు కొచ్చిన బాలినేని ఇదే విషయమై ప్రశ్నిస్తే.. చెవిరెడ్డి పేరెత్తడానికి కూడా ఇష్టపడకుండా తీవ్రంగా రియాక్ట్ అయ్యారు.రాష్ఠంలో వైసీపీ ఇంత ఘోరంగా ఓడిపోయాక కూడా జగన్ పార్టీ సీనియర్ల మాట వినటం లేదన్నది బాలినేని అవేదనగా తెలుస్తుంది. ఎన్నికల ఫలితాలు వచ్చాక ఆయన్న జగన్‌ను ఇప్పటి వరకు కలవలేదు. అధికారంలో ఉన్నప్పుడు అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా.. తన మంత్రి పదవి మధ్యలో తీసేసి అనేక అవమానాలకు గురిచేశాడని జగన్‌పై బాలినేనికి కోపం ఉంది.. చెవిరెడ్డి విషయంలో జగన్ నిర్ణయంపై ఆయన తీవ్ర ఆగ్రహంతో ఉన్నారంట. ప్రకాశం జిల్లా బాధ్యతాలు జిల్లాకు చెందిన వ్యక్తులకు ఇవ్వాలని సజ్జల రామకృష్ణారెడ్డికి బాలినేని చెప్పారంట. చెవిరెడ్డి, గీవిరెడ్డి పేర్లు వస్తే జిల్లాలో తీవ్ర పరిణామాలు ఉంటాయని బాలినేని సజ్జలకు చెప్పటంతో చెవిరెడ్డి పేరు ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టారంటున్నారు.2014సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ఓడిపోయాక ప్రకాశం జిల్లాలో పార్టీ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో చేరడంతో వైసిపి ఉంటుందాలేదా అనే చర్చ సాగింది. కొద్దిరోజుల తర్వాత బాలినేని జిల్లా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు. పార్టీని మళ్లీ బలోపేతం చేశారు. ఎన్నికల నాటికి వైసీపీ పుంజుకుంది. 2019 సార్వత్రి ఎన్నకలలో ఉమ్మడి ప్రకాశం లో 12కి 8 స్థానాలు వైసిపి గెలుచుకుంది. మొన్నటి ఎన్నికల్లో బాలినేనిని పట్టించుకోకుండా జగన్ అభ్యర్థులను ప్రకటించడంతో వైసీపీ జిల్లాలో 2 స్థానాలకే పరిమితమైంది.సీనియర్ నేతలు, మంత్రులుగా చేసిన నేతలు అందరూ ఓడిపోయారు. ఎవరూ నియోజకవర్గాల్లో కనిపించడం లేదు. ఆ క్రమంలో వైసీపీ అభిమానులు మళ్లీ బాలినేనికే పగ్గాలు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. బాలినేని దానికి ఒప్పుకోకపోతే.. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రాసాద్‌రెడ్డికి అధ్యక్ష పగ్గాలు ఇవ్వాలన్న వాదన వినిపిస్తోంది. బూచేపల్లి శివప్రాసాద్ రెడ్డి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన తల్లి వెంకాయమ్మ జడ్పీ ఛైర్మన్ గా ఉన్నారు. వైసీపీ పగ్గాలు బూచేపల్లి కుటుంబానికి ఇస్తే తనకు అభ్యంతరం లేదని బాలినేని అంటున్నారు. మరి చూడాలి జగన్ నిర్ణయం ఎలా ఉంటుందో?

# ఇంకా కోలుకోని వైసీపీ...



తిరుపతి, జూలై 17 త్తూరు జిల్లా ఒకప్పుడు వైసీపీకి కంచుకోట. ఉమ్మడి జిల్లాలో మొత్తం 14 నియోజకవర్గాలు ఉంటే 2014 ఎన్నికల్లో 8 స్థానాలను గెలుచుకున్న వైసీపీ.. 2019లో తన బలాన్ని ఏకంగా 13 స్థానాలకు పెంచుకుంది. ఇక తాజా ఎన్నికల్లో సీన్ రివర్స్ అయ్యింది. ఒక స్థానం నుంచి ఏకంగా 12 స్థానాలను గెలుచుకుని రికార్డు సృష్టించింది టీడీపీ. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా అయినా.. స్థానిక పరిస్థితులు, సామాజిక లెక్కలతో వైసీపీయే ఆధిపత్యం చలాయించేది. కానీ, రాష్ట్రవ్యాప్తంగా వీచిన ఎదురుగాలికి.. చంద్రబాబు హవా కూడా తోడు కావడంతో వైసీపీ రెండు స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పుంగనూరు నుంచి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి నుంచి ఆయన సోదరుడు ద్వారక నాథరెడ్డి మాత్రమే విజయం సాధించారు. ఓడిపోయిన 12 మందిలో ఒకరిద్దరు తప్ప మిగిలిన నేతలు అంతా ఫలితాల విడుదల తర్వాత పత్తా లేకుండా పోవడం చర్చనీయాంశమవుతోంది.మాజీ సీఎం వైయస్ జగన్‌కు సన్నిహితులుగా ముద్రపడ్డ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి ఈ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకున్నారు. వారి స్థానంలో వారసులను రాజకీయ అరంగేట్రం చేయించారు. వారిద్దరు ఓటమి చెందడంతో మళ్లీ నియోజకవర్గాల బాధ్యతలను మాజీ ఎమ్మెల్యేలు తీసుకున్నారు. చంద్రగిరిలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మళ్లీ యాక్టివ్ అవ్వగా, భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన తనయుడు అభినయ రెడ్డి మాత్రం ఓటమి బాధ నుంచి ఇంకా తేరుకోలేదు. టీటీడీ చైర్మన్ పదవికి కరుణాకర్ రెడ్డి, తిరుపతి డిప్యూటీ మేయర్ పదవికి అభినయ్ రెడ్డి రాజీనామా చేశారు. ఇక శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి జాడ తెలియడం లేదని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓటమి తర్వాత ఆయన పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారని చెబుతున్నారు.చిత్తూరు వైసీపీలో ఎందరో కీలక నేతలు ఉండగా, ఓటమి అందరినీ కోలుకోలేని దెబ్బతీసింది. ఫైర్‌బ్రాండ్ లీడర్‌గా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న మాజీ మంత్రి రోజా నగరిలో ఎదురైన పరాభవంతో బయటకు రావడం లేదు. నగరిలో ఇంటికే పరిమితమైన రోజా మీడియా కంటపడకుండా తిరుగుతున్నారు. పార్టీ కార్యకర్తలతోనూ ఆమె మాట్లాడటం లేదు. అదేవిధంగా గంగాధర నెల్లూరులో పోటీ చేసిన మాజీ మంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి కూడా ఇంటికి పరిమితమయ్యారు. ఐదేళ్లపాటు మంత్రిగా పనిచేసిన నారాయణస్వామి? తన కుమార్తె ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు. ఫలితాల తర్వాత కుటుంబ సభ్యులతోనే ఆయన గడుపుతున్నారుఇక సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని చిత్తూరు అసెంబ్లీ టికెట్ దక్కించుకున్న విజయానంద రెడ్డి.. ఫలితాల విడుదల తర్వాత పత్తా లేకుండా పోయారు. సొంత పార్టీ కార్యకర్తలకు కూడా ఆయన అందుబాటులోకి రావడం లేదు. ఇదే విధంగా మరో సిట్టింగ్ ఎమ్మెల్యే టికెట్‌కు ఎసరు పెట్టిన మదనపల్లి నేత నిస్సార్ అహ్మద్ కూటా ఓటమిని తట్టుకోలేకపోతున్నారు. ఆయనా ఇల్లు వదిలి బయటకు రావడం లేదు. పెద్దిరెడ్డి ఆశీస్సులతో సరిగ్గా ఎన్నికలకు ముందు నిస్సార్ అహ్మద్ మదనపల్లి వైసీపీ అభ్యర్థిగా మారారు. ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన నిస్సార్ అహ్మద్‌కు ఎన్నికల ఫలితం తీవ్ర అసంతృప్తి మిగిల్చింది. ఆయన ప్రస్తుతం కుటుంబ సభ్యులతోనే గడుపుతున్నారు.ఇక పీలేరును తన అడ్డాగా మార్చుకుని?. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చింతల రామచంద్రారెడ్డి సైతం ఓటమితో కుంగిపోయారు. ఓటర్లు ఇచ్చిన షాక్‌తో ఆయన పూర్తిగా ఆయన ఇంటికే పరిమితమయ్యారు. పలమనేరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే వెంకట గౌడ జాడ తెలియడం లేదు. ఆయన బెంగళూరుకు వెళ్లిపోయినట్లు కార్యకర్తలు చెబుతున్నారు. బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునే వెంకట్ గౌడకు 2019 ఎన్నికల్లో అనూహ్యంగా వైసీపీ టికెట్ దక్కింది. ఆ ఎన్నికల్లో టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డిపై వెంకట గౌడ అనూహ్య విజయం సాధించారు. మొన్నటి ఎన్నికల్లో వెంకట గౌడను ఓడించి అమర్నాథరెడ్డి ప్రతీకారం తీర్చుకున్నారు. గత 20 రోజుల్లో ఆయన ఒకటి రెండుసార్లు నియోజకవర్గానికి వచ్చారు తప్ప పూర్తిగా బెంగళూరుకి పరిమితమయ్యారు.ఇక మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులతో సత్యవేడు వైసీపీ టిక్కెట్ దక్కించుకున్న రాజేష్.. సత్యవేడు నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదు. ఆయన సొంత నియోజకవర్గం తిరుపతి. ఎస్సీ రిజర్వుడు స్థానమైన సత్యవేడులో ఆఖరి నిమిషంలో ఆయనకు టికెట్ ఇచ్చింది వైసీపీ. రాజేశ్ రాకతో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం వైసీపీకి రాజీనామా చేసి, టీడీపీలో చేరి మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సత్యవేడులో మార్పు వైసీపీ ఓటమికి కారణమవగా, ఎన్నికల తర్వాత చుక్కాని లేని నావలా తయారైంది వైసీపీ పరిస్థితి.ఇదేవిధంగా పూతలపట్టు, కుప్పంలో పోటీ చేసిన వైసీపీ నేతలు సైతం కార్యకర్తలకు అందుబాటులో లేకుండా తిరుగుతున్నారు. కుప్పంలో చంద్రబాబుపై పోటీ చేసిన ఎమ్మెల్సీ భరత్ అప్పుడప్పుడు మాత్రమే బయటకు వస్తున్నారు. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి వైసీపీని పూర్తిగా డ్యామేజ్ చేసింది. ఎన్నికల విజయం తర్వాత టీడీపీ దూకుడుగా ఉంటే.. తమ నాయకులు ముఖం చూపకపోవడం వల్ల? అధికార పార్టీకి టార్గెట్ అవుతున్నామని వాపోతున్నారు కార్యకర్తలు.

# అధికారం వచ్చినా... ఆనందం ఆవిరి

విజయవాడ, జూలై 17ః(న్యూస్ పల్స్)వైఎస్ జగన్ ను అధికారంలోకి దించాలనుకున్నారు. దించేశారు. ఇందుకోసం ఏడు పదుల వయసులో ఆయన పడిన కష్టాన్ని ఎవరూ కాదనలేరు. జైల్లోకి వెళ్లారు. అయినా 2019 ఎన్నికల్లో ఓటమి పాలయిన నాటి నుంచి పార్టీని తిరిగి నిలబెట్టేందుకు ఆయన చేపట్టిన ప్రతి చర్య అభినందనీయమే. ఏమాత్రం నిరాశ పడలేదు. నేతలు ఒకింత దూరంగా ఉన్నా.. క్యాడర్ వద్దకు తానే వెళ్లి వారిని యాక్టివ్ చేయగలిగారు. ఇక కూటమిగా ఏర్పాటు కావడంతో ఆయన చూపించిన సహనాన్ని ఎవరూ తోసిపుచ్చలేరు. అన్నీ భరిస్తూ... విజయం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూశారు. అనుకున్న సమయం రానే వచ్చింది. గతంలో ఎన్నడూ రానంత విజయం దక్కింది. ఎంతగా అంటే ప్రజల మూడ్ ను చూస్తుంటే టీడీపీ ఒంటరిగా పోటీ చేసినా గెలిచేదన్న లెక్కలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.సరే... అదలా ఉంచితే.. ఇప్పుడు గెలిచి ముఖ్యమంత్రి పదవి చేపట్టినా చంద్రబాబు లో ఆనందం కనిపించడం లేదు. ఖజానా ఖాళీ అయింది. ఈసారి ఆయన రెండు పనులు పూర్తి చేయాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి నిర్మాణాలను చేపట్టి తీరాలి. ఎందుకంటే ఈ రెండు ఆయన తన కలలు ప్రాజెక్టులుగా పదే పదే చెబుతూ వచ్చారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో పోలవరం ప్రాజెక్టును 70 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని ఆయన అంటున్నారు. వైసీపీ ఐదేళ్ల హయాంలో రెండు శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయారంటున్నారు. కానీ తీరా చూస్తే పోలవరం పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పనులు పూర్తి కావాలంటే అధికారులు నాలుగు సీజన్లు కావాలని చెబుతున్నారు. పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి మరీ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలి. ఇక అమరావతి నిర్మాణం కూడా అంత సులువు కాదు. ఎందుకంటే భవనాలు అయితే నిర్మించవచ్చు కానీ.. దానికి రాజధానికి కావాల్సిన హంగులన్నీ తీర్చిదిద్దాలంటే వేల కోట్లు అవసరమవుతాయి. ఇవన్నీ కావాలంటే కేంద్రం సహకారం అవసరం. అది ఎంత వరకూ సాధ్యమవుతుందో చెప్పలేం. ఎందుకంటే అక్కడ ఉన్నది మోదీ. ఉత్తర భారత రాష్ట్రాలను కాదని, ఏకపక్షంగా ఏపీకి నిధులు కుమ్మరిస్తారనుకోవడం అత్యాశే అవుతుంది. టీడీపీ మద్దతు పై కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉన్నప్పటికీ చంద్రబాబు డిమాండ్ చేసే పరిస్థితుల్లో ఉండరు. ఎందుకంటే మరోసారి మోదీతో కయ్యానికి దిగే సాహసాన్ని ఆయన చేయకపోవచ్చు. రాష్ట్ర ప్రయోజనాలకే అయినా వరసగా ఇలా కూటమిలో చేరడం, వెళ్లడం పై ప్రజల్లోనూ ఒకరకమైన వ్యతిరేకత ఎదురవుతుందన్న భావన ఆయనలో సహజంగా ఉంటుంది. అందుకే చంద్రబాబు ఇప్పటికిప్పుడు సంపదను సృష్టించే మార్గాలు లేవు. ఇచ్చిన హామీలు కూడా అమలు పర్చాల్సిన సమయం దగ్గర పడుతుంది. ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు పర్చాలంటే లక్ష కోట్ల రూపాయలకు పైగానే నిధులు అవసరమవుతాయి. అలాగని అధికారంలోకి రాగానే పన్నుల భారాన్ని ప్రజలపై మోపలేని పరిస్థితి. అందుకే ఢిల్లీ వైపు చూడటం తప్ప ఇప్పుడు చంద్రబాబు వద్ద మరో ఆప్షన్ లేకుండా పోయింది. కేంద్రాన్ని ఒప్పించి, మెప్పించి నిధులు తెచ్చుకోగలిగితేనే కొంత వరకూ ఈ సమస్యల నుంచి ఆయన బయటపడతారు. అధికారంలోకి వచ్చి నెల మాత్రమే కావడంతో ఇప్పుడిప్పుడే పెద్దగా ప్రజలు కూడా పట్టించుకోరు. కానీ కాలం గడుస్తున్న కొద్దీ హామీలు అమలు చేయాలన్న వత్తిడిని చంద్రబాబు విపక్షాలు, జనం నుంచి ఎదుర్కొనక తప్పదు. అందుకే చంద్రబాబుకు ఈ ఏడాది మాత్రం పాలన కత్తిమీద సామే అవుతుందని మాత్రం చెప్పక తప్పదు.

### శానిటరీ వర్కర్లను దూరంగా ఉండి సెల్ఫీలు తీసుకోమన్న రోజా

**తమిళనాడులోని తిరుచందూర్ లో ఘటన**

**తమిళనాట వీడియో వైరల్?**

**రోజాపై తీవ్ర విమర్శలు చేస్తున్న నెటిజన్స్**

తిరుపతి,తమిళనాడు తిరుచెందూర్లోని ప్రసిద్ధి చెందిన సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆడి మాస అభిషేకం ఘనంగా జరిగింది. ఈ నేపథ్యంలో నటి, మాజీ మంత్రి రోజా తన భర్త, దర్శకుడు ఆర్కే సెల్వమణితో కలిసి నిన్న ఆలయాన్ని సందర్శించారు. అలాగే స్వామి దర్శనం ముగించుకుని బయటకు రాగానే పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది నటి రోజాను సెల్ ఫోన్లలో చిత్రీకరించారు. ఆ సమయంలో ఆలయంలో పనిచేస్తున్న ఇద్దరు ప్రైవేట్ క్లీనింగ్ వర్కర్లు గా పని చేస్తున్న మహిళలు ఆశగా ఫోటో దిగాలని నటి రోజా వద్దకు వెళ్లగా, నటి రోజా వాళ్లను దూరంగా ఉండమని చెప్పింది. ఇప్పుడీ వీడియో ఫుటేజ్ వైరల్గా మారడంతో పాటు నటి రోజా స్వచ్ఛ్ కార్మికులను దూరంగా ఉండమని చెబుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి మరియు అంటరానితనాన్ని కొనసాగిస్తూ నటి రోజా స్వచ్ఛ్ కార్మికులను పక్కన పెడుతున్న దృశ్యాలు పలువురిని ఆలోచింపజేస్తున్నాయి

# విశాఖ ఫైల్స్.. ఎవరి కొంప ముంచుతుందో..

విశాఖపట్టణం, జూలై 17విశాఖ ఫైల్స్ తయారవుతోంది. కశ్మీర్ ఫైల్స్ సినీ రంగంలో పెను సంచలనం సృష్టిస్తే? విశాఖ ఫైల్స్ విడుదలకు ముందే పొలిటికల్ సర్కిల్స్‌ను కుదిపేస్తోంది. రాజకీయ రంగం స్థలంపై ఆవిష్కరణకు సిద్ధమవుతున్న విశాఖ ఫైల్స్ సినిమా అనుకుంటే మీరు పొరబడినట్లే?. విశాఖ కేంద్రంగా గత ఐదేళ్లుగా చోటుచేసుకున్న భూ దందాలపై టీడీపీ ఎక్కు పెట్టిన అస్త్రమే విశాఖ ఫైల్స్. సినిమాల్లో హీరోలు ఉంటారు.. విలన్స్ ఉంటారు? కానీ ఏపీ రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్న విశాఖ ఫైల్స్‌లో విలన్ క్యారెక్టర్లే ఎక్కువగా ఉంటారని చెబుతోంది అధికార టీడీపీ? గత ఐదేళ్లలో విశాఖ కేంద్రంగా చోటు చేసుకున్న భూ ఆక్రమణలు, ఇతర దందాలను బయటపెట్టేందుకు విశాఖ ఫైల్స్ తయారు చేస్తున్నట్లు టీడీపీ ప్రకటించడం రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. ఈ పొలిటికల్ ఫైల్స్‌లో ఏం ఉంటుంది? ఎవరిని టార్గెట్ చేస్తుందనేది రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖలో విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని టీడీపీ ఆరోపిస్తోంది. వైసీపీ అధికారంలో ఉండగా ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఎన్నో పోరాటాలు చేసింది టీడీపీ.. జనసేనాని పవన్ కూడా అప్పట్లో విశాఖలో భూదందాలపై పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఐతే ప్రతిపక్షంగా టీడీపీ, జనసేన ఎంత గొంతు చించుకున్నా? గత ప్రభుత్వం చలించలేదు. విశాఖ భూ దందాల్లో వైసీపీ ముఖ్య నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులపై ఆరోపణలు రావడంతో గత పాలకులు అస్సలు పట్టించుకోలేదని అప్పట్లో ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఐతే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేతులు మారడంతో విశాఖ భూములపై ఫోకస్ చేసింది ప్రభుత్వం. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటం.. ఈ మూడు పార్టీలూ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటంతో విశాఖ భూముల దందాపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. అక్రమాలకు పాల్పడిన నేతలపై చర్యలు తీసుకునేలా? విశాఖ ఫైల్స్ సిద్ధం చేస్తోంది.గత వారం విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. విశాఖ ఫైల్స్‌ను రూపొందించాలని మాజీ మంత్రి గంటాను ఆదేశించారు. సీఎం సూచనలతో రంగంలోకి దిగిన గంటా? త్వరలో విశాఖ ఫైల్స్‌ను విడుదల చేస్తామని ప్రకటించారు. గత నెలలో రుషికొండ రహస్యాలను ఛేదించిన గంటాకు ప్రత్యేకంగా ఈ పని అప్పగించడమే రాజకీయంగా చర్చకు దారితీస్తోంది. గత ప్రభుత్వంలో నిర్మించిన రుషికొండ ప్యాలెస్‌ను సామాన్యులు ఎవరూ చూడలేకపోయారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సెక్యూరిటీని ఛేదించుకుని వెళ్లిన గంటా? రుషికొండ రహస్య భవనాలను మీడియాకు చూపించడం ద్వారా? వైసీపీని ఆత్మరక్షణలోకి నెట్టేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు భూ దందా బాగోతం బయటపెట్టే పనిని గంటాకే అప్పగించారు చంద్రబాబు..ఇక అధినేత ఆదేశాలతో రంగంలోకి దిగిన గంటా? విశాఖలో అక్రమ భూ భాగోతాలను బటయకు తీస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర వైసీపీ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించిన ఆ పార్టీ సీనియర్ నేతలతోపాటు? మాజీ ప్రజాప్రతినిధులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నట్లు సమాచారం. భోగాపురం ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ఉన్న అసైన్డ్ భూములతోపాటు విశాఖ నగరంలోని ఖరీదైన ప్రాంతంలోని దసపల్లా, ఎన్‌సీసీ, హయగ్రీవ ప్రాజెక్టు భూములు?. వైసీపీ నేతల పరమైన వైనాన్ని బయటపెట్టనున్నట్లు టీడీపీ చెబుతోంది. ఈ భూ దందాలపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదులు అందినా, గతంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉండటంతో ఎలాంటి యాక్షన్ తీసుకుంటుందోనని టెన్షన్ కనిపిస్తోంది.వైసీపీ బడా లీడర్లపైనే ఎక్కువగా ఆరోపణలు ఉండటంతో పార్టీకి మరింత డ్యామేజ్ జరిగే ప్రమాదం ఉందని ఆ పార్టీ క్యాడర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు భూములు, గనుల వ్యవహారాలపై శ్వేతప్రతం విడుదల చేసిన సీఎం చంద్రబాబు.. విశాఖ భూ అక్రమాలను ప్రత్యేకంగా ప్రస్తావించడం వైసీపీ నేతలను మరింత టెన్షన్‌కు గురిచేస్తోంది. మొత్తానికి టీడీపీ ఆధ్వర్యంలో వస్తున్న విశాఖ ఫైల్స్ ఎవరి కొంప ముంచుతుందనేదే పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.

# టీడీపీలోనూ రెబల్ ముద్ర

నరసాపురం, జూలై 17,ఘురామక్కృష్ణం రాజు అప్పుడే మొదలు పెట్టారా? అసమ్మతి రాజకీయాలకు బీజం వేస్తున్నారా? స్వపక్షంలో విపక్షపాత్రను ప్రారంభించారా?అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.ఈ ఎన్నికల్లో టిడిపి తరఫున ఉండి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేశారు రఘురామ.మంచి మెజారిటీతో గెలిచారు.మంత్రి పదవి ఆశించారు. కానీ ఎందుకో చంద్రబాబు కేటాయించలేదు. ముందుగా శాసనసభ స్పీకర్ పదవి కేటాయిస్తారని ప్రచారం జరిగింది. కానీ అనూహ్యంగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుకు దక్కింది సభాపతి పదవి. దీంతో సాధారణ ఎమ్మెల్యే గానే రఘురామకృష్ణం రాజు కొనసాగాల్సి వస్తోంది. అయితే ఇటీవల యూట్యూబ్ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను ప్రస్తావించారు రఘురామ.చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారు.ఆయనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో టీడీపీలో సైతం రఘురామ మొదలు పెట్టేసారా అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున నరసాపురం ఎంపీ స్థానానికి పోటీ చేశారు రఘురామకృష్ణంరాజు. అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. కానీ అక్కడికి ఆరు నెలలు తిరగకముందే పార్టీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధినాయకత్వాన్ని విభేదించారు. జగన్ తో జగడం పెట్టుకున్నారు. రాజకీయ ప్రత్యర్థులతో చేయి కలిపారు. గిట్టని వారితో చట్టపట్టలేసుకుని తిరిగారు. ఎల్లో మీడియాతో అంటగాకారు. వాటికి ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చారు. డిబేట్ లలో పాల్గొన్నారు. వైసీపీ సైతం ఆయనపై అనర్హత వేటు వేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేసింది. అరెస్టు చేయించి రాజా ద్రోహం కేసు కూడా వేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఏపీలో విపక్షాలకు రఘురామకృష్ణం రాజు ఒక వనరుగా మారిపోయారు.వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా రఘురామకృష్ణం రాజుకు అవకాశం ఇవ్వకపోవడంతోనే ఆయన అసంతృప్తి ప్రారంభమైంది. వైసిపి పార్లమెంటరీ పార్టీ నేతగా పెద్దిరెడ్డి మిధున్ రెడ్డికి జగన్ అవకాశం ఇచ్చారు. రాజ్యసభలో వైసీపీ పక్ష నేతగా విజయసాయి రెడ్డికి ఛాన్స్ ఇచ్చారు. ఆ ఇద్దరు నేతలకు ఢిల్లీ రాజకీయ బాధ్యతలు అప్పగించారు. అయితే ఇది రఘురామకృష్ణంరాజుకు నచ్చలేదు. సీనియర్ గా ఉన్న తనను నియమించాలని ఆయన కోరారు. కానీ జగన్ పరిగణలోకి తీసుకోలేదు. అప్పటినుంచి ఒక రకమైన అసంతృప్తితో రఘురామకృష్ణంరాజు గడిపేవారు. అదే అసమ్మతికి దారితీసింది. ఆయనను పార్టీ నుంచి దూరం చేసింది. రెబల్ గా మారిన రఘురామకృష్ణం రాజు.. జగన్ పతనమయ్యే వరకు వదలనని తేల్చి చెప్పారు. అలాగే చేసి చూపించారు. రఘురామకృష్ణం రాజును జగన్ నిలువరించాలని ప్రయత్నం చేసినా దొరకలేదు. చివరకు టిడిపిలో చేరి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.తాజాగా యూట్యూబ్ ఛానల్ కు ఇంటర్వ్యూ ఇచ్చారు రఘురామకృష్ణం రాజు. చంద్రబాబు సర్కారులో మంత్రి పదవి దక్కక పోవడంపై అడిగిన ప్రశ్నకు సమాధానం గా చెప్పిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. మంత్రి పదవి అన్ని కులాలకు ఇవ్వలేరు. చంద్రబాబు భయపడే కులాలు కొన్ని ఉంటాయి. నచ్చని కులాలు కూడా ఉండొచ్చు. భయపడే కులాలకు ఎక్కువ పదవులు ఇచ్చి.. నచ్చని కులాన్ని పక్కన పెట్టొచ్చు అని కామెంట్స్ చేశారు. బ్రాహ్మణ కులం నుంచి ఒక్క ఎమ్మెల్యే కూడా లేరని.. క్షత్రియ కులంలో ఆరేడుగురు ఎమ్మెల్యేలు గెలిచిన మంత్రి పదవి ఇవ్వలేదని రఘురామ గుర్తు చేశారు. రఘురామ కృష్ణంరాజు చేసిన కామెంట్స్ పై ఇప్పుడు టిడిపి శ్రేణులు మండిపడుతున్నాయి. ఆయన ఎక్కడ ఉన్నా వైఖరి మారదని విమర్శలు వస్తున్నాయి.వైసిపి మాదిరిగా ఇక్కడ చేస్తామంటే కుదిరే పని కాదు. ఇప్పటికే పార్టీ ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు చంద్రబాబు. మరోవైపు పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఇంకోవైపు ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామి. అందుకే వైసిపి మాదిరిగా రఘురామకృష్ణంరాజు తోక జాడిస్తానంటే కుదిరే పని కాదు. అంతవరకు ఛాన్స్ ఇవ్వరు కూడా చంద్రబాబు. అయితే రఘురామ విషయంలో టిడిపి శ్రేణులు సైతం కొంచెం ఆగ్రహంతో ఉన్నాయి. ఏ పార్టీ పట్టించుకోని క్రమంలో చంద్రబాబు పిలిచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. అదే విషయాన్ని గుర్తు చేసుకొని నడుచుకోవాలని సూచిస్తున్నారు టిడిపి శ్రేణులు. మరి రఘురామకృష్ణం రాజు ఎంతవరకు కుదురుగా ఉంటారో చూడాలి.

# ఎంపిడివో మిస్సింగ్

నర్సాపురం,పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ఎంపీడీవో వెంకటరమణ మిస్సింగ్ అయ్యారు. నెల మూడో తేదీ నుంచి ఆయన మెడికల్ లీవ్ పెట్టి స్వస్థలం కృష్ణా జిల్లా పెనుమూరు వెళ్లారు. ఉదయం బయటికి వెళ్లిన ఆయన మంగళవారం సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య పెనమలూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. సెల్ ఫోన్ కూడా కాల్ డైవర్షన్ లో ఉంది .దీంతో ఆయన ఆచూకీ పెద్ద సస్పెన్స్ గా మారింది.అయితే ఎంపీడీవో మానసిక ఒత్తిడికి వైసిపి నాయకులే కారణమన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.

# కువైట్ శివ కథ సుఖాంతం

విజయవాడ, జూలై 17, నిరుపేద కుటుంబం. సొంతింటి కల సాకారం చేసుకునేందుకు 5 లక్షల రూపాయలు అప్పు చేశారు.దానిని ఎలా తీర్చాలో తెలియక ఉపాధి బాట పట్టాడు ఆ ఇంటి యజమాని. విదేశాలకు వెళ్తే స్వల్పకాలంలోనే అప్పులు తీర్చవచ్చని.. ఇద్దరి కుమార్తెలకు మంచి భవిష్యత్తు ఇవ్వవచ్చని కలలు కన్నాడు. కానీ ఆ కలలను చిదిమేశాడు ఆ ఏజెంట్. రంగుల కలను చూపించి.. నడి ఎడారిలో విడిచి పెట్టాడు. ఆ కుటుంబాన్ని నట్టేట ముంచాడు. కువైట్లో చిక్కుకొని అష్ట కష్టాలు పడిన శివ వ్యధ ఇది.ఆయన కుటుంబాన్ని పలకరిస్తే కన్నీరు ఆపుకోలేం. వారి కష్టాలను జీర్ణించుకోలేం..కువైట్ లో అష్ట కష్టాలు పడుతూ సోషల్ మీడియా ద్వారా సాయాన్ని అర్థించిన శివ వివరాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం మండలం చింతపర్తి బీసీ కాలనీ ఆయన స్వగ్రామం. చిత్తూరు జిల్లా కల్లూరు కు చెందిన శివ 18 సంవత్సరాల కిందట చింతపర్తికి వచ్చి శంకరమ్మ ను పెళ్లి చేసుకున్నాడు. అక్కడే ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. శివ భార్య శంకరమ్మ, పెద్ద కుమార్తె ప్రతిరోజు వ్యవసాయ పనులకు కూలీలుగా వెళుతుంటారు. కూలి చేస్తే కానీ పూట గడవని పరిస్థితి వారిది. ఇలాంటి నేపథ్యంలో కుమార్తెలను చదివించడానికి, పెళ్లి చేసేందుకు రాయచోటికి చెందిన ఏజెంట్ ద్వారా ఇటీవల శివ కువైట్ వెళ్ళాడు.అక్కడ చెప్పిన పని కాకుండా ఎడారిలో జంతువుల పెంపకం బాధ్యతలను అప్పగించారు. అప్పటినుంచి మనో వ్యధకు గురైన శివ తనను కాపాడాలంటూ సోషల్ మీడియాలో కోరడం, ఏపీ మంత్రి లోకేష్ వరకు ఆ విషయం వెళ్లడంతో ఎట్టకేలకు విముక్తి లభించింది.అయితే గ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. శివ చిన్న కుమార్తె తండ్రిని తలుచుకుని కన్నీటిపర్యంతమయ్యారు. తమ కుటుంబం ఏ స్థితిలో ఉందో వివరించే ప్రయత్నం చేశారు.తమను పెంచి, చదివించేందుకు తమ తండ్రి పడిన బాధను వివరిస్తూ ఇద్దరు పిల్లలు రోదించారు. వారి పరిస్థితిని చూసిన స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. స్వచ్ఛంద సంస్థలు సాయం చేసేందుకు ముందుకు వచ్చాయి.రాయలసీమలో విదేశీ ఉద్యోగాల పేరిట జరుగుతున్న దందాను ఈ ఘటన బయటపెట్టింది.ఇంటి అవసరాల కోసం చేసే అప్పు, పిల్లల చదువులు, వారికి పెళ్లిళ్లు.. వీటిపై ఆలోచన చేసి తన భర్త శివ విదేశాలకు వెళ్ళాడని.. కానీ ఏజెంట్ మోసం చేశాడని భార్య శంకరమ్మ కన్నీరు మున్నీరయింది. కువైట్ నుంచి తిరిగి రప్పించాలంటే విమాన ఖర్చులకు 30000 రూపాయలు చెల్లించాలని ఏజెంట్ డిమాండ్ చేసినట్లు చెబుతోంది. ఇప్పటికే ఐదు లక్షల రూపాయలు అప్పులు చేసిన తనకు.. ఒక్క రూపాయి కూడా అప్పు పుట్టలేదని.. అందుకే చెల్లించలేదని తన మనసులో ఉన్న బాధను వ్యక్తపరిచింది. ఎంత కష్టమైనా భరించాలని తన భర్తకు సూచించినట్లు చెప్పుకొచ్చింది.అటు శివ సైతం సోషల్ మీడియాలో పెట్టిన వీడియోలు తన భార్యను కూడా తప్పుపట్టారు. అయితే గ్రామంలో కుటుంబ పరిస్థితి తెలిశాక.. ఏ స్థితిలో భార్య వారించి ఉంటుందో తెలుస్తోంది.కేవలం కుటుంబ అవసరాలను దాటించుకునేందుకు, కష్టాలను గట్టెక్కించేందుకు.. ఎంత కష్టమైనా ఓర్చుకోవాలని సూచించినట్లు భార్య చెబుతోంది.అయితే తన తండ్రి క్షేమంగా ఇంటికి రావాలని కోరుకుంటూ ఆ పిల్లలిద్దరూ పడుతున్న తపన అంతా ఇంతా కాదు. వారి కళ్ళల్లో ఆ ఆర్ద్రత కనిపిస్తోంది. తండ్రి ఎంత కష్టంలో చిక్కుకున్నాడో తెలియజేస్తోంది.

# దారి వారి సొంత జాగీరా

**అక్రమ పార్కింగ్ కు నిలయంగా ఇండోర్ స్టేడియం, కలెక్టర్ కార్యాలయం ప్రధాన రహదారి...**

**ఇష్టనుసారంగా రోడ్డు మార్జిన్లు ఆక్రమణ...**

**రోడ్డుకి ఇరువైపులా ప్రైవేట్ స్కూల్ బస్సులు, కారులు...**

**నిత్యం ఈ దారిపై రాకపోకలు సాగిస్తున్నా చర్యలు చేపట్టని అధికారులు...**

**ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగుల, అవస్థలు...**

ఏలూరు,అది ఏలూరు ఇండోర్ స్టేడియం మెయిన్ గేటుకు వెళ్లే రహదారి. ఈ మార్గంలో పలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు ఉన్నాయి. నిత్యం జిల్లా కలెక్టర్, మండల అధికారులు, ఉద్యోగులు, రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రహదారికి ఇరువైపులా ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు, వాహన యజమానులు అక్రమ పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతిరోజు సాయంత్రం 4:30 నుండి 7:30 గంటల వరకు వాహనాలను నిలిపి ఉంచడంతో దారి కుచించుకుపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఈ మార్గంలో అధికారులు రాకపోకలు సాగిస్తున్నా వాహనాల అక్రమ పార్కింగ్ ను తొలగించే ప్రయత్నం చేయడం లేదు. దీంతో వాహన యజమానులు ఈ రహదారిని సొంత జాగీరులా మార్చుకున్నారు.మధ్యలో ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని పార్కింగ్ జోన్ గా వినియోగించుకుంటున్నారు. అక్రమ పార్కింగ్ వల్ల ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధాన దారి కుచించుకుపోయింది. గతంలో ఇరుకుగా ఉన్న ఈ రహదారిని విస్తరణ చేపట్టారు. అక్రమ పార్కింగ్ వల్ల ప్రయోజనం లేకుండా పోయింది. సామాన్య ప్రజలు, ఉద్యోగులు, వృద్ధులు, విద్యార్థులు, తీవ్ర అవస్థలు పడుతున్నారు. దారికి ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.దీనికి తోడు రహదారిపై ఆవులు, కుక్కల సంచారంతో సమస్య తీవ్రంగా ఉంది. ద్విచక్ర వాహన చోదకులకు ఆవులు, కుక్కలు అడ్డువచ్చి అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. ఇక మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్లు, ట్రిపుల్ రైడింగ్ తో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.× ఇష్టనుసారంగా రోడ్డు మార్జిన్లు ఆక్రమణఇదే ప్రాంతంలో గజం స్థలం కనపడిన అక్రమార్కులు ఆక్రమించేస్తున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రంథాలయం రిజిస్టర్ ఆఫీస్ ఈ మూడు కోడళ్ళు ఉన్న ప్రాంతం అక్రమాకులకు కల్పతరువుగా మారింది. రోడ్డు మార్జిన్ లను ఆక్రమించేసి చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ దుకాణాలను పలువురికి వేలాది రూపాయలకు అద్దెలికిస్తూ కాసులు దండుకుంటున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో అనేకమంది అక్రమణలకు పాల్పడినట్లు తెలుస్తోంది. కొందరు పలుకుబడి ఉపయోగించి దర్జాగా అక్రమంగా చేస్తున్నారు. అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం గమనార్హం.. ఇప్పటికే మున్సిపల్ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, పోలీసులు, రవాణా శాఖ, అక్రమ పార్కింగ్ ను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ముత్తలూరు గ్రామంలో ప్రజలు మినరల్ వాటర్ మాత్రమే తాగాలి.... ఈవోపిఆర్డి శ్రీనివాస శర్మ

పాత్రికేయులతో మాట్లాడుతున్న ఈవో పీఆర్డి.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోనిముత్తలూరు గ్రామ ప్రజలు మినరల్ వాటర్ మాత్రమే తాగాలని ఈవోపిఆర్డి శ్రీనివాస శర్మ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముత్తలూరు గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాల వలన గ్రామములోని చేతి పంపులలోని నీరును ల్యాబ్ టెస్టింగ్ పంపడం జరిగిందన్నారు. ఈ పరీక్షల్లో నీరు త్రాగుటకు పనికి రాదని, మరియు అనాధ వృద్ధాశ్రమం వద్ద ఉన్న చేతి పంపుల నీరు కలుషితమైనది అలాగే నరసాపురం పాఠశాల దగ్గర ఉన్న చేతి పంపు కూడా త్రాగుటకు పనికి రాదని కేవలం ప్రభుత్వ కొళాయి నీరు మాత్రమే ఉపయోగించుకోవాలని శుద్ధ జలం నీరును మాత్రమే త్రాగుటకు ఉపయోగించాలని తెలిపారు. వర్షాలు కురిసినప్పుడు కాచి చల్లార్చి వడపోసిన నీటిని త్రాగాలి అని ఆయన కోరారు. పంచాయితీ కార్యదర్శి ఈ విషయం పై ప్రజలలో అవగాహన కల్పించాలని వీలు ఉన్న చోట్ల చేతి పంపులను క్లోరినేషన్ చేయించాలని వాటర్ ట్యాంక్ ను ప్రతీ 15రోజులకు ఒకసారి శుభ్రపరచి క్లోరినేషన్ చేయించాలని తెలిపారు.

## క్రిష్టిపాడు,లో ఘనంగా పీర్ల పండుగ.



దొర్నిపాడు, జూలై :17, శ్రీ ప్రస్థానం న్యూస్ :- మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో పీర్ల పండుగను పురస్కరించుకుని బుధ వారం నాడు పీర్ల చావిడి యందు పీర్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. భక్తులు పీర్ల చావిడి లోనీ పీర్లను దర్శించిచుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తి శ్రద్ధలతో పీర్లను మోస్తూ భక్తులు నిప్పుని తొక్కి తమ భక్తిని చాటుకున్నారు..హిందూ,ముస్లిం,లు ఐక్యత కలిగి సోదర భావం తో కలిసి మెలసి కుల మతాలకు అతీతంగా ఆనవాయితీ ప్రకారం ప్రతి సంవత్సరం పీర్ల పండుగను జరుపుకుంటామన్నారు.పీర్ల పండుగ రోజున గుండం చుట్టూ ప్రదర్శనలు చేస్తూ వేశా దారణలతో డప్పు వాయిద్యాలు మద్య డాన్స్ లు వేసస్తూ పీర్లను ఊరేగిస్తారు.పీర్ల ఊరేగింపును తిలకించేందుకు గ్రామంలోని ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు...

## ఘనంగా మొహరం వేడుకలు

.శ్రీ ప్రస్థానం న్యూస్ కోవెలకుంట్ల : కోవెలకుంట్ల మండలం లోని పట్టణ మరియు గ్రామీణప్రాంతాలలో ముస్లిం సోదరులు కలసికట్టుగా మొహరం వేడుకలలు ఆయా గ్రామలలో ముస్లిం పెద్దల సమక్షంలో ఘనంగా నిర్వహించడం జరిగింది .ముస్లిం ఆచారం ప్రకారం అన్నిరకాల పీర్లను స్థానిక కుందూ నది జలధి కి తరులయి . .కులాలకు మతాలకు అతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు .డ్రమ్స్ , తప్పేట్లు ,యువకులు డాన్సులతో ఆయా వీధిలలో సందడి వావరణం నెలకొంది .ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరుగ కుండా కోవెల కుంట్ల సి ఐ జయ చంద్ర ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది .

## కెమికల్ కంపేనీలో ప్రమాదం ?కార్మికుడు మృతి

అనకాపల్లి,అచ్చుతాపురం, రాంబిల్లి మండలాల సెజ్ పరిధిలో గల వసంత కెమికల్ ఫ్యాక్టరీలో ఈరోజు ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో జరిగిన రియాక్టివ్ నుండి వచ్చిన (ాఖీఎ) సేఫ్టీ రిలీవ్వాల్ ఫీల్ అవ్వడంతో వెలువడిన అగ్నికి ఒక ఎంప్లాయ్ తీవ్రంగా గాయాల పాలవడంతో అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్ కి తరలించగా మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పరిశ్రమలోనే సంఘటనా స్థలాన్ని తాసిల్దార్ ఆర్డీవో అగ్నిమాపక శాఖ అధికారులు పోలీసులతో కలిసి సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం అందించాలని సిఐటియు కార్మిక ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. మృతుడు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రతాప్ రౌతు (43 ) సంవత్సరాలు. ఇతనికి ఒక భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు మృతుడు కుటుంబానికి సమాచారం అందించినట్లు యాజమాన్యం తెలిపారు.....

# పోరుమామిళ్ల అటవీ శాఖలో ఇంటి దొంగలు

అటవీ సంపదను దోచుకుంటున్న ఒక అధికారి
అక్రమంగా ఎర్రచందనం తరలింపు
అటవీ సంపద తరలింపులో బీట్ అధికారులే కీలకం
తాజాగా ఇద్దరూ పోలీసులు
ఎర్రచందనం తరలింపులో ఆ ఇద్దరు పోలీసులు కీలకపాత్ర
ఇప్పటికీ పరారీలో ఆ ఇద్దరు పోలీసులు

బద్వేలు ,బద్వేలు పోరుమామిళ్ల అటవీ శాఖలో ఇంటి దొంగలు ఎక్కువయ్యారు అటవీ సంపదను దోచుకుంటున్న ఒక అధికారిని ఇటీవల టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారుబద్వేలు పోరుమామిళ్ల అటవీశాఖ పరిధిలోని అడవుల్లో పెద్ద ఎత్తున ఎర్రచందనం ఉంది ఇది అందరికీ తెలిసిన విషయమే ఎర్రచందనం తరలించే విషయంలో కొందరు బీట్ అధికారులే కీలకపాత్ర పోషిస్తున్నారు ఇది కూడా అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే రెండు ఫారెస్ట్ రేంజ్ లో పరిధిలో లెక్కకు మించి ఎర్రచందనం స్మగ్లర్లు ఉన్నారు కానీ అధికారుల లెక్కల్లో కేవలం కొద్ది మంది మాత్రమే ఈ పని చేస్తున్నట్లు చెబుతున్నారు బద్వేల్ కేంద్రంగా తల పండిన ఎర్రచందనం స్మగ్లర్లు ఇప్పటికీ లేకపోలేదు పైకి పెద్దమనుషుల చలామణి అవుతున్న వారు ఇప్పటికి కూడా అదే వృత్తిలో ఉన్నారు అటవీ సంపదను దోచుకుంటూ భారీ ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు తాజాగా బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సుధాకర్ అట్లూరు పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న రామకృష్ణ ఎర్రచందనం రవాణా లో కీలక పాత్ర పోషిస్తున్నారు ఇది విషయం అధికారుల విచారణలో బయట పడడంతో జిల్లా పోలీస్ ఎస్పీ వారిద్దరిని సస్పెండ్ చేశారు ఇప్పటికీ ఆ ఇద్దరూ పోలీస్ కానిస్టేబుళ్లు ఇప్పటికీ పరారీలో ఉన్నట్లు సమాచారం ఇది కూడా అందరికీ తెలిసింది అడవుల్లోని కలప ఎంతో విలువైన అటవీ సంపదను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు గత నెల రోజులుగా ఈ దోపిడి మరింత ఎక్కువైంది పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని బీట్ అధికారి దస్తగిరి రెడ్డి అక్రమంగా కలప తరలిస్తూ టాస్క్ ఫోర్స్ అధికారులకు పట్టుబడ్డారు ఇలాంటి కోవలోకి మరి ఎంతోమంది బీట్ అధికారులు ఉన్నారు ఈ విషయాన్ని టాస్క్ ఫోర్స్ అధికారులే ప్రైవేట్ సంభాషణలో చెబుతున్నారు అడవుల్లో చెట్లను నరికించి వాటిని బొగ్గుగా మార్చి ట్రాక్టర్ కు 3000 రూపాయల ప్రకారం వసూలు చేస్తున్నారు ఇది కూడా అందరికీ తెలిసిందేఅడవుల్లో ఒకపక్క ప్లాంటేషన్ జరుగుతుంటే మరోపక్క ఎంతో విలువైన చెట్లను నరికించి బొగ్గుగా మార్చడం ఆందోళన కలిగించే విషయం పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని అటవీ శాఖ అధికారులే పదేపదే చెబుతుంటారు కానీ చేతలకు మాటలకు పొంతనే లేకుండా పోయింది కొద్దిరోజులక్రితం పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజి పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ అధికారులే చెబుతున్నారు ఉన్నతాధికారుల కళ్ళు కప్పి ఎంత అటవీ సంపదను దోచుకున్నారు అనే విషయం లెక్క తెలవలసి ఉంది

# రైతు ఆదాయం పెంపుకు కృషి

--ప్రకృతివ్యవసాయాన్నిప్రోత్సహిస్తాం
--- సాంకేతిక పరిజ్ఞానం సాయంతో దిగుబడి పెంపకు చర్యలు
--- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతు కు చేరువ చేస్తాం
--- భూసారం పెంపుకు ప్రాధాన్యత
--- నాపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెం నాయుడు అధికారులకు ధన్యవాదాలు
కమీషనర్ ఎస్.ఢిల్లీరావు

అమరావతి,శతాబ్దాల కాలం నుంచి అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతుల ఆదాయం పెంపే లక్ష్యమని నూతనంగా వ్యవసాయ శాఖ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. డిల్లీరావు అన్నారు. మంగళగిరిలోని వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంలో వేద పండితుల పూర్ణకుంభ స్వాగతంతో కార్యాలయంలోకి కార్యాలయ ఉద్యోగులు ఆహ్వానించారు. అనంతరం కార్యాలయంలో విధులకు సంబంధించిన దస్త్రంపై సంతకం చేసి భాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రైతు ప్రయోజనాల కోసం వ్యవసాయ శాఖ తీసుకోనున్న చర్యలను వివరించారు. విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి ఎక్కడెక్కడ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించే పరిస్థితులు ఉన్నాయో లాభ నష్టాలను బేరీజు వేసుకొని రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా అమలు చేస్తామన్నారు. ముఖ్యంగా పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పెంచేందుకు అవసరమైన కార్యాచరణను అమలు చేస్తామన్నారు. ఇటీవల ప్రకృతి వ్యవసాయంలో మన రాష్ట్రానికి లభించిన అంతర్జాతీయ పురస్కారం “గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ” స్ఫూర్తితో ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహం లభించేలా రైతులను సిద్ధం చేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రధానంగా రసాయనాల వినియోగం ద్వారా తగ్గుతున్న భూసారం వల్ల నష్టపోతున్న రైతులలో అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ కృషి చేస్తుందన్నారు. రైతులు పండిస్తున్న ప్రతి పంటకు గిట్టుబాటు ధర లభించేందుకు, రైతులు మరింత ఎక్కువ దిగుబడి సాధించేందుకు అవసరమైన చర్యలు కూడా చేపట్టనున్నట్లు వివరించారు. వ్యవసాయంలో మాస్టర్స్ డిగ్రీ చేసిన తనపై నమ్మకంతో వ్యవసాయ శాఖను అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చన్నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ప్రయోజనం కోసం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని రైతు చెంతకు చేరేలా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగు శాతంగా ఉన్న రాష్ట్ర వ్యవసాయ వృద్ధిరేటును కనీసం ఇంకొక్క శాతమైనా

పెరిగేందుకు తమ శాఖ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేస్తారని చెప్పారు. నకిలీ ఎరువులు పురుగు మందులు విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపుతామని నాణ్యమైన విత్తనాలు పురుగు మందులు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాననితెలిపారు. క్రిమిసంహారక మందుల వినియోగంలో కూడా వ్యవసాయ శాఖ రైతులలో చైతన్యం పెంచేలా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులకు శిక్షణ ఇస్తామన్నారు. అన్ని రంగాలపై ఎంతో అవగాహన ఉన్న ముఖ్యమంత్రి లక్ష్యాల మేరకు వ్యవసాయ శాఖను అన్నిరంగాల కంటే ముందు ఉండేలా అవసరమైన ప్రణాళికతో తమ శాఖ ఉద్యోగులతో కలిసి సమిష్టి బాధ్యతతో తన ప్రత్యేకత చాటుకుంటానని తెలిపారు. పుస్తకాల ద్వారా నేర్చుకున్న వ్యవసాయ విజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రంలోని రైతుల జీవితాలలో మరింత మార్పు తెచ్చేలా శాఖ పనితీరు ఉంటుందన్నారు. దేశానికి రైతే వెన్నె ముక అనే సూత్రానికి త్రికరణ శుద్ధిగా తాను నమ్ముతానన్నారు. అనంతరంచిర్రావూరు గ్రామానికి చెందిన పోకల పాములు, వీరిశెట్టి శివయ్య, శ్రీనివాసరావు, చిన్న వడ్లపూడి గ్రామానికి చెందిన గూడూరు గోపాలరావు, రాయంకుల వెంకటేశ్వరరావు, వలివేటి జగన్మోహన్ రావులను కమీషనర్ ఢిల్లీరావు సన్మానించారు. కార్యక్రమంలో శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్ వి వి స్వర్ణ జయలక్ష్మి, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ మరియు శిక్షణ కేంద్రం డైరెక్టర్ బి. ప్రసాద్, ఆత్మ డైరెక్టర్ వివి విజయలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ వి. శ్రీధర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. బాలసుబ్రమణ్యం, జె. జగ్గారావు , జిల్లా వ్యవసాయ అధికారులు ఎస్. నాగమణెమ్మ వెంకటేశ్వర్లు విజయ భారతి బాల భాస్కర్ ఏఓఎ సంఘం కార్యదర్శి ప్రవీణ్ పలువురు అధికారులు సిబ్బంది కమీషనర్ ఢిల్లీరావు కు శుభాకాంక్షలు తెలిపారు.

# నెల్లూరులో రొట్టెల పండగ సందడి

నేడు గంధం కోసం ప్రత్యేక ఏర్పాట్లు

నెల్లూరు,జూలై17: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన నెల్లూరు భార షాహిద్ దర్గా రొట్టెల పండుగ సందడి నెలకొంది. పండుగకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు . ప్రతి సంవత్సరం మోహరం తరువాత రోజు రొట్టెల పండుగను నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా 18 నుంచి ఈనెల 21 వరకు పండుగ జరగ నుంది. పండుగలో అత్యంత ముఖ్యమైన గంధం ఈనెల 18 న జరుగనుంది. గంధంకి సంభందించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు.. బారా షాహిద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. మాములుగా మొహోరం తరువాత రోజు నుంచి పండుగ ప్రారంభం అవుతుంది. అయితే ప్రతి ఏడాది ఒక రోజు ముందు నుంచే భక్తులు తాకిడి అధికంగా ఉంటుంది. ఈ ఏడాది సైతం పండుగకు ఒక రోజు ముందు నుంచే వేలాది మంది భక్తులు బారా షాహిద్ దర్గాకు తరలి వస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన పండుగకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. దర్గా ప్రాంగణం మొత్తం రంగు రంగుల విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. స్వర్ణాల చెరువులో భక్తులు రొట్టెలు వదులు కునేందుకు వీలుగా ప్రత్యేక ప్లాట్ ఫామ్ లు సిద్ధం చేశారు. పండుగకు వచ్చే భక్తులకు మంచి నీరు, భోజనం, పార్కింగ్ పై ప్రత్యేక దృష్టి సారించారు. కోర్కెలు తీర్చాలని కోరుతూ అనేక రకాల రొట్టెలు ఇచ్చి పుచ్చుకుంటారు. ఏ కోర్కె కోరుకుంటే ఆ రొట్టె తీసుకుంటారు. కోర్కె తీరిన వారు వచ్చే ఏడాది పండుగ నాడు తిరిగి చెల్లిస్తారు. ఎవరికైతే ఆ రొట్టె కావాలో వారు తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పండుగ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎక్కడ ఏ రొట్టె అందుబాటులో ఉందో తెలిసేలా స్వర్ణాల చెరువులో ప్రత్యేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బారా షాహిద్ దర్గా రొ÷-టటెల పండుగలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగురు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు తగ్గట్టుగానే అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పండుగను విజయవంతం చేసేందుకు ఆధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. రొట్టల పండుగకు పది లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారనే అంచనాలతో ఆ దిశగా ఏర్పాట్లు చేశారు.

# దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే సృజనా చౌదరి

విజయవాడ,విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సృజనా చౌదరి బుధవారం నాడు ఇంద్రకీలాద్రిలోని దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు.అయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి కేస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. తరువాత అయన స్వామివారి ఆలయం చేరుకొని, స్వామి వారి దర్శనం చేసుకున్నారు.మహమండపం 4 వ అంతస్తు చేరుకొని, ఈవో కార్యాలయంలో ఆలయ అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ పై ఈవో, ఆలయ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా ఆలయ ఈవో మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ లో అంశాలను వివరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ దుర్గమ్మ దర్శనం అయ్యాక ఈవో రామారావు, అధికారులతో కలిసి దుర్గ గుడి లో మౌలిక వసతులు పై చర్చించటం జరిగింది. దుర్గ గుడి లో అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం చర్చలు జరిగాయి. దుర్గ గుడి నీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. త్వరలో మరొక సమావేశంలో ఆర్థిక పరిస్థితి మరియు ఇతర విషయముల పై చర్చించి, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## ఘనంగా ముగిసిన పీర్ల పండుగ వేడుకలు.

పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు.





నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని పలు గ్రామాలలో బుధవారం పీర్ల పండుగ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా కుల మతాలకతీతంగా ప్రజలు అందరూ రంగులు చల్లుకుంటూ సంతోషంతో పీర్ల పండుగ కార్యక్రమంలో పాల్గొని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ముందుగా పీర్లు ఊరేగింపుగా పలు వీధుల వెంబడి అంగరంగ వైభవంగా ఊరేగుతూ దర్గాల, పీర్ల చావిడిల దగ్గర భక్తులకు దర్శనమిచ్చాయి. ఈ సందర్భంగా భక్తాదులందరూ పీర్ల దగ్గరికి వెళ్లి వారి యొక్క మొక్కుబడుల ముడుపులను చెల్లించుకున్నారు. అనంతరం చక్కెర గుండ్లు,లెవడాలతో వెళ్లి ఊరేగుతున్న పీర్ల పైన చల్లారు.

## ఘనంగా ముగిసిన మోహరం పండుగ వేడుకలు..

పాణ్యం సీఐ నల్లప్ప , గడివేముల ఎస్ఐ బీ టీ వెంకటసుబ్బయ్య......



శ్రీ ప్రస్థానం: పాణ్యం ఇంచార్జి : పాణ్యం నియోజకవర్గ పరిధిలోని గడివేముల మండలం పెసరవాయి గ్రామంలో మొహరం పండుగ వేడుకలో పాణ్యం సీఐ నల్లప్ప మరియు గడివేములఎస్సై బి టి వెంకటసుబ్బయ్య భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు,ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా బుధవారం ముగిశాయిని పాణ్యం సీఐ నల్లప్ప మరియు గడివేముల ఎస్ ఐ బి టి వెంకటసుబ్బయ్య తెలియజేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ........ మొహరం పండుగ వేడుకల్లో పీర్ల స్వామి వారిని దర్శనం కొరకు అశేష సంఖ్యలో వచ్చిన భక్తులుకు పీర్ల సావిడి ప్రాంగణంలో భక్తులకు క్యూలైన్లను, పార్కింగ్ స్థలాలను, దైవ దర్శన నిమిత్తం భక్తులకు వెళ్ళు పరిసర ప్రాంతాల భద్రతా ఏర్పాట్లను చేశామన్నారు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మొహరం పండుగ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయనితెలియజేశారు,ఈ కార్యక్రమంలో పాణ్యం సీఐ నల్లప్ప మరియు గడివేముల ఎస్ఐ బి టి వెంకటసుబ్బయ్య తమ సిబ్బందితో గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు,

## భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు..





దొర్ని పాడు, జూలై:17, శ్రీ ప్రస్థానం న్యూస్:- హిందువుల పండుగ లో మొదటిగా వచ్చే తొలి ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని బుదవారం నాడు దొర్ని పాడు మండల కేంద్రం తో పాటు ఆయా గ్రామాల్లో తెల్ల వారు జాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.. మండల కేంద్రంలోని శ్రీ మాధవ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..అలాగే క్రిష్టి పాడు గ్రామంలో వెలసిన శ్రీ నాగే శ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో భక్తులు పాల్గోని భజన కార్యక్రమం నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757